Visakha
Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 99487 49799

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్




RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 90 విశాఖపట్నం, 13 జనవరి 2024 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

# రంగరంగ వైభవంగా జీవీఎల్ మహాసంక్రాంతి సంబరాలు ప్రారంభం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శోభకృత్ నామ సంవత్సర మకర సంక్రాంతి విశాఖ ప్రజల జీవితాల్లో అభ్యుదయపరమైన మార్పులు తేవాలని, అందరూ ఆనందోత్సాహాలతో జీవించాలని బీజేపీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు ఆకాంక్షించారు. టీం జీవీఎల్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం వద్దగల ఏయూ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన మహాసంక్రాంతి ఉత్సవాలను జీవీఎల్ నరసింహారావు దంపతులు వేదోక్త విధానంలో పూజలు జరిపి శుక్రవారం ఉదయం ప్రారంభించారు.



ఈ సందర్భంగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ నమూనా ఇండ్లను, ఇతర కళారూపాలను ఆవిష్కరించారు. తప్పెటగుళ్ళు, కోలాటాలు, పులివేషాలు, సంక్రాంతి ముగ్గులు వేసే మహిళలతో ప్రాంగణం కళకళలాడింది. సాయంత్రం భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడంతో పాటు అనేకరకాల కళాప్రదర్శనలను నిర్వహించారు.

వేదికపై నుండి బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ సాధారణంగా సంక్రాంతి మూడు రోజుల పండుగ అని, నగరంలో నివసించే ప్రజలు వివిధ గ్రామాలకు వెళ్ళి బంధు మిత్రుల కలయికతో బాటు గ్రామీణ సంక్రాంతి వేడుకలను చూసి ఆనందిస్తారని, అయితే వివిధ కారణాలతో నగరంలో ఉండిపోయినవారంతా గ్రామీణ ప్రాంతపు సంక్రాంతి వాతావరణాన్ని చూసి అనుభూతి చెందేందుకు ఇక్కడ ఒక గ్రామాన్నే నిర్మించామని అనేక మంది గ్రామీణ కళాకారులను ఇక్కడికి రప్పించి నాలుగు రోజుల పాటు నగర ప్రజలకు కనువిందు చేస్తున్నామని అన్నారు. సంక్రాంతి పండుగ హిందువులకు ఎంతో ఆనందం పంచే పండుగ అని అందుకే ఇక్కడ సుమారు 50 మంది చేనేత కళాకారులతో చేనేత వస్త్ర దుకాణాలు, సాంప్రదాయ వంటకాల దుకాణాలు ఇంకా అనేక రకాల బొమ్మలు వగైరాలు ఏర్పాటు



సతీసమేతంగా శ్రీ జీవీఎల్ నరసింహారావు

చేశామని, సంక్రాంతి రోజు బొమ్మల కొలువు కూడా ఉంటుందని, అనేక ప్రాంతాల నుండి వేలాదిగా హస్తకళాకారులు చేసిన బొమ్మలను ప్రదర్శిస్తారని తెలిపారు.

ప్రఖ్యాత గాయకులు ఘట్టి వేదభాస్కరం ప్రార్థనా గీతంతో సభ ప్రారంభమైంది. సంక్రాంతి సంబరాలు శని, ఆది, సోమవారాల్లో ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తారని శనివారం జబర్దస్త్ బృందం ప్రదర్శనతో బాటు ప్రఖ్యాత గాయనీ గాయకులు ప్రేక్షకులను అలరిస్తారని తెలిపారు.

















# ఈనెల 20న ప్రసిద్ధి చెందిన వేల్పుల వీధి శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

## అత్యంత ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్రలో పేరుగాంచిన వేల్పులవీధి శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవం ఈ నెల 20న ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వాకాడ బాబు, మద్దాల నూకరాజు లు, ఉపాధ్యక్షులు సీరం శెట్టి నరసింగరావు, సహాయ కార్యదర్శి పనస శ్రీకాంత్, కోశాధికారి వేల్పుల గణేష్ తెలిపారు. ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ఏడాది అమ్మవారు ఉత్సవాన్ని భారీ స్థాయిలో నిర్వహించడానికి చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా వద్ద డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం, జార్జ్ క్లబ్ వద్ద డాన్స్ షో, పూడిమడక రోడ్డు హాస్పిటల్ వద్ద ధమాకా డాన్స్ నైట్, ఎన్టీఆర్ స్టేడియం వద్ద డాన్స్ హంగామా ఎమ్మెస్ రావు షాపు వద్ద మ్యూజికల్ నైట్ షో, రామచంద్ర థియేటర్ వద్ద డాన్స్ కార్యక్రమం, సత్యదేవ హాస్పిటల్ ఆధ్వర్యంలో పూడిమాడక రోడ్డు రామాలయం వద్ద డాన్స్ హంగామా, శారద బ్రిడ్జి వద్ద డూప్స్ బాబోయ్ డూప్స్ విజయనగరం వారిచే కార్యక్రమం, గాజువాక బస్టాండ్ వద్ద శ్రీ కళామతల్లి బుర్రకథ, రాతి మేడ వద్ద బాలనాగమ్మ బుర్రకథ, చిన్న నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద విజయనగరం వారిచే రేలారే లేరా డాన్స్ కార్యక్రమం, జీవీఎంసీ ఆఫీస్ వద్ద పాడుతా తీయగా ఆర్కెస్ట్రా కార్యక్రమం, వేపగుంట వారిచే తీన్మార్ డాన్స్ కార్యక్రమం, రాతి మేడ వద్ద బుర్రకథ, జీవీఎంసీ ఆఫీస్ వద్ద పాడుతా తీయగా ఆర్కెస్ట్రా, కేరళ డప్పులు డాన్స్, విశాఖపట్నం జాలరి పేట వారిచే దాండియా డాన్స్, విజయనగరం వారిచే భయంకర పులి వేషాలు, తప్పెడుగుల్లు పొడుగు కాళ్ల మనుషుల డాన్స్, కోయ వేషాలు, కోలాటం ఆటలు, దాండియా డాన్స్ తదితర నేల



వేషాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాగే వీధుల్లో పూర్ణ ఆధ్వర్యంలో గుడి అలంకరణ, శారదా బ్రిడ్జి వద్ద, దిశ పోలీస్ స్టేషన్ ఎదురుగా, అమ్మవారి గుడి వద్ద భక్తులకు ఉచితంగా ప్రసాదం పంపిణీ చేయడం జరుగుతుందని వారు వివరించారు.ఈ సమావేశంలో వీధి పెద్దలు దోమరౌతు రామారావు, మద్దాల కూర్మారావు, ముత్తా ఈశ్వరరావు మద్దాల రమణబాబు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

**ఉత్సవం పై ఆంక్షలు సడలించాలి...**

అనకాపల్లి లో శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవంకు రాష్ట్రం నుండే గాక , ఇతర రాష్ట్రాల నుండి ప్రజలు వస్తుంటారు. అనకాపల్లిలో జరిగే ఏకరాత్రి ఉత్సవం ఈ గౌరమ్మ సంబరం . గతంలో రాత్రి 8 గంటలకు ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు తెల్లవారుజాము నాలుగు గంటల వరకు జరిగేవి. సంబరాన్ని తిలకించేందుకు ప్రజలు రాత్రి 9 గంటల నుండి వచ్చేవారు. సంబరం తిలకించేందుకు వేలాదిగా ప్రజలు తరలివస్తారు. ఉత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. అయితే ఇటీవల అనకాపల్లి జిల్లాగా ఏర్పడిన తర్వాత శాంతి భద్రతల దృష్ట్యా 12 గంటల లోపే ఉత్సవాన్ని నిలుపుదల చేయాలని ఆంక్షలు విధిస్తుండటం వల్ల ఏకరాత్రి ఉత్సవం పూర్తిస్థాయిలో జరగడం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వలె ఉత్సవ నిర్వహణకు సమయం కేటాయించి లక్షల ఖర్చు పట్టి నిర్వహిస్తున్న ఈ ఉత్సవం పూర్తిస్థాయిలో జరిగేందుకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సహకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.




# భారతీయ యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భారతీయ యువతకు స్ఫూర్తి ప్రదాతగా స్వామి వివేకానంద నిలుస్తారని ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత అన్నారు. వివేకానంద జయంతి, యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ ఈసి హాల్‌లో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత మాట్లాడుతూ సనాతన ధర్మానికి రాయభారిగా, మహోన్నత వాగ్ధాటితో భారతదేశ సంస్కృతి వారసత్వాన్ని ప్రపంచానికి వివేకానంద పరిచయం చేసారన్నారు. భారతీయ యువతకు దిశానిర్ధేశం చేసిన స్వామి వివేకానంద నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. భారతీయుల్లో జాతీయవాద స్ఫూర్తిని నింపడంలో, యువతకు మార్గనిర్ధేశం చేయడంలో ఆయన ప్రసంగాలు ఎంతో ప్రభావవంతంగా నిలచాయన్నారు. సమభావన, సోదర భావనతో ఇతరుల పట్ల దయ, ప్రేమ కలిగి ఉండాలనే వారి సందేశం నేటికీ అచరణీయమన్నారు. వివేకానందుని బోధనలు మానవాళికి మార్గదర్శనం చేస్తూనే ఉంటాయన్నారు.

కార్యక్రమంలో ఉర్దూ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య రహమాన్, ఏయూ ఓఎస్‌డి ఆచార్య వి.కృష్ణమోహన్,ఏపి ఉన్నత విద్యమండలి సెక్రటరీ ఆహ్మద్ నజీర్, ఏయూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో కాలనీని సందర్శించిన చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్

**విజయనగరం:** ముఖ్యమంత్రి శ్రీ.వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రములో 1.50 లక్షల టిడ్కో గృహ ప్రవేశాలు జరగాలనే దిశగా ఈ జనవరి 2024 నెలాఖరు నాటికి సారిపల్లిలో 1024 గృహాలు మరియు సోనియానగర్ లలో నిర్మిస్తున్న 1088 గృహాలు మొత్తంగా కలిసి 2112 గృహ ప్రవేశాలు జరిగే దిశగా చర్యలు చేపడుతున్నట్టు టీడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ తెలిపారు. తమ సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలన కార్యక్రమములో టిడ్కో చైర్మన్ శ్రీ.జమ్మాన ప్రసన్న కుమార్ శుక్రవారం పాల్గొన్నారు.

ఏ.పి.టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ తన అధికారిక పర్యటనలో భాగముగా నేడు నగరంలోని సారిపల్లిలో 1024 గృహాలు మరియు సోనియానగర్ లో 1088 గృహాలు మొత్తంగా కలిసి 2112 గృహాలు త్వరలో ప్రారంభోత్సవం చేయబోయే గృహ నిర్మాణ పనులను వాటి పురగతిని పరిశీలించి తగు సూచనలు చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో భాగముగా ముందుగా విజయనగరం శాసన సభ్యులు మరియు డిప్యూటీ స్పీకర్ శ్రీ కోలగట్ల వీరభద్రస్వామి గారిని, విశాఖపట్నం పార్లమెంట్ సమన్వ య కర్త శ్రీమతి బొత్స ఝాన్సీ గారిని మరియు విజయనగరం పార్లమెంట్ సమనవ్వయ కర్త శ్రీ మజ్జి శ్రీనివాసరావు గారిని మర్యాదపూర్వకంగా కలిసి టిడ్కో హౌసింగ్ ప్రాజెక్ట్ అమలు పై చర్చించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో చైర్మన్ గారు లబ్దిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇప్పటికే రాష్టంలో 95 వేల గృహాలు అందించడం జరిగింది అని తెలియజేస్తూ, తదుపరి రాబోయే ఫిబ్రవరి 2024 నాటికి ప్రభుత్వం నిర్దేశించిన ఒక లక్షా యాభై వేల ఇళ్లను లబ్దిదారులకు అందించే కార్యక్రమము చేపట్టడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది.

టిడ్కో లబ్దిదారులకు సుమారుగా 10లక్షల విలువైన ఆస్థిని జగనన్న కానుకగా ఇవ్వడం అనేది భారతదేశము లో ఏ ముఖ్యమంత్రి చేయలేని పని చేసి పేదల కళ్ళలో ఆనందము చూడటమే తన పరమావధిగా భావించిన ఏకైక ముఖ్యమంత్రి



మన గౌరవ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అనీ ఇంజనీరింగ్ అధికారులకు తెలియజేయడం జరిగింది.

పైన తెలిపిన ఈ కార్యక్రమంలో ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీమతి.జ్యోతి గారు, డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్స్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ మరియు వారి సహచర సిబ్బంది, మరియు కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# విజయవాడ నుంచి పోటీ చేస్తే నా గెలుపు ఖాయం: సుజనా చౌదరి

బీజేపీ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు సుజనా చౌదరి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీ హైకమాండ్ ఆదేశిస్తే విజయవాడ నుంచి పోటీ చేస్తానని ఆయన తెలిపారు. విజయవాడ నుంచి తనను ఎన్నికల బరిలోకి దింపితే తప్పకుండా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. రాష్టంలో పొత్తులపై తమ అధిష్ఠానం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఏపీ రాజధానిగా అమరావతే ఉంటుందని అన్నారు. అమరావతికి బీజేపీ హైకమాండ్ అనుకూలంగా ఉందని చెప్పారు.

ఏపీలో ఈసారి ఎన్నికలు స్వేచ్ఛగా జరుగుతాయని సుజనా చౌదరి అన్నారు. బీజేపీ చేసిన ఫిర్యాదులపై ఎన్నికల కమిషన్ తగు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వాలంటీర్లను ఎన్నికల కమిషన్ దూరంగా ఉంచడం మంచి పరిణామమని అన్నారు. ఏపీ రాజ్యసభ ఎన్నికలపై బీజేపీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు.










Compli

విశాఖ సమాచారమ్

శనివారం 13-01-2024

# అబ్బురపరచే విద్యావ్యవస్థ

భారతదేశంలో 13 విశ్వవిద్యాలయాలు ఉండేవని!!

ఇక్కడ ప్రపంచం నలుమూలల నుండి విద్యార్థులు చదువుకోవడానికి వచ్చేవారని!

టర్కిష్ ,మొఘల్ దండయాత్ర వలన కాలిపోయింది అని అనేక హిందూ దేవాలయాలు కొల్లగొట్టబడ్డాయి అని మెగాస్టీన్స్ అల్బీరుని యు ఎన్ సాంగ్ యొక్క గ్రంథాలలో చాలా గొప్ప భారతదేశం యొక్క వివరణ ఉంది. పురాతన కాలంలో భారతదేశం అంతటా 13 పెద్ద విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి.

8 వ శతాబ్దం నుండి 12 వ శతాబ్దం వరకు, భారతదేశం మొత్తం ప్రపంచంలోనే అతిపెద్ద మరియు ప్రసిద్ధ విద్యా కేంద్రంగా ఉంది.

**1. నలంద విశ్వవిద్యాలయం**

పురాతన భారతదేశంలో ఇది ఉన్నత విద్య యొక్క అతి ముఖ్యమైన మరియు ప్రసిద్ధ కేంద్రం. ఈ విశ్వవిద్యాలయం చపాట్నా నగరానికి ఆగ్నేయంగా 88.5 కిలోమీటర్లు, ప్రస్తుత బీహార్‌లోని రాజ్‌గిర్ నుంచి 11.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గొప్ప విశ్వవిద్యాలయం శిధిలాలు దాని ప్రాచీన శోభకు చాలా అనుభవాన్ని ఇస్తాయి.

ఈ విశ్వవిద్యాలయం గురించి సమాచారం ఏడవ శతాబ్దంలో భారతదేశాన్ని సందర్శించిన చైనా యాత్రికుడు చజువాన్జాంగ్ మరియు చఎట్సింగ్ యొక్క ప్రయాణ వివరాల లో కూడా ఉంది.

10,000 మంది విద్యార్థులకు బోధించడానికి 2 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ విశ్వవిద్యాలయం స్థాపించిన ఘనత గుప్త పాలకుడు కుమారగుప్తుడు I, (450-470)కు చెందుతుంది. గుప్త రాజవంశం పతనం తరువాత కూడా, పాలక రాజవంశాలన్నీ దాని శ్రేయస్సుకు దోహదం చేస్తూనే ఉన్నాయి. దీనిని గొప్ప చక్రవర్తి హర్షవర్ధన మరియు పాల పాలకులు కూడా పోషించారు. భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుండి కాకుండా కొరియా, జపాన్, చైనా, టిబెట్, ఇండోనేషియా, పర్షియా మరియు టర్కీ నుండి కూడా విద్యార్థులు ఇక్కడకు వచ్చేవారు.

**2. తక్షశిలా విశ్వవిద్యాలయం**

ఇది అన్నింటికంటే పురాతన విశ్వవిద్యాలయం. రాజకీయ నాయకుడు చాణక్య ఇక్కడ అధ్యక్షుడిగా ఉన్నారు. తక్షశిలా విశ్వవిద్యాలయం సుమారు 2700 సంవత్సరాల క్రితం స్థాపించబడింది. ఈ విశ్వవిద్యాలయంలో సుమారు 10500 మంది విద్యార్థులు చదువుతుండేవారు. ఈ విద్యార్థులలో చాలామంది వివిధ దేశాల నుండి వచ్చారు. అక్కడి క్రమశిక్షణ చాలా కఠినమైనది. వారు తప్పు చేస్తే యువరాజులను కూడా దండించేవారు. తక్షశిలా రాజకీయాలు మరియు పురావస్తు విద్య కోసం ప్రపంచ స్థాయి కేంద్రంగా ఉండేది. వివిధ రాష్ట్రాల నుండి 103 మంది యువరాజులు అక్కడ ఒక ఆయుధశాలలో చదువుతుండేవారు.

**3. విక్రమ్ సిలా విశ్వవిద్యాలయం**

విక్రమ్ సిలా విశ్వవిద్యాలయాన్ని పాల రాజవంశం రాజు ధర్మ పాల్ స్థాపించారు. 8 వ శతాబ్దం నుండి 12 వ శతాబ్దం చివరి వరకు ఈ విశ్వవిద్యాలయం భారతదేశంలోని ప్రధాన విద్యా కేంద్రాలలో ఒకటి. ప్రస్తుత భారత పటం ప్రకారం, ఈ విశ్వవిద్యాలయం బీహార్‌లోని చభాగల్పూర్ నగరం చుట్టూ ఉండాలి.

**4. వల్లభీ విశ్వవిద్యాలయం**

వల్లభీ విశ్వవిద్యాలయం సౌరాష్ట్ర (గుజరాత్) లో ఉంది. 6 వ శతాబ్దం నుండి 12 వ శతాబ్దం వరకు, దాని కీర్తి దాదాపు 600 సంవత్సరాలు గరిష్టంగా ఉంది. 7 వ శతాబ్దంలో ఈ విశ్వవిద్యాలయం గుణమతి మరియు శ్యామతి పేర్లతో అత్యంత ముఖ్యమైన అభ్యాస కేంద్రంగా ఉందని చైనా యాత్రికుడు ఈట్-సింగ్ రాశారు. ఈ విశ్వవిద్యాలయం లౌకిక విషయాలలో విద్యకు ప్రసిద్ధి చెందింది. ప్రపంచం నలుమూలల నుండి విద్యార్థులు ఈ విద్యా కేంద్రానికి రావడానికి కారణం ఇదే.

**5. ఒదంతపురి విశ్వవిద్యాలయం**

ఉదంతపురి విశ్వవిద్యాలయం మగధలో స్థాపించబడింది, అంటే నేటి బీహార్. దీనిని పాల రాజవంశం రాజులు స్థాపించారు. ఎనిమిదవ శతాబ్దం చివరి నుండి 12 వ శతాబ్దం వరకు దీని అభివృద్ధి సుమారు 400 సంవత్సరాలు గరిష్టంగా ఉంది. ఈ విశ్వవిద్యాలయంలో సుమారు 12000 మంది విద్యార్థులు ఉండేవారు.

**6. సోంపురా విశ్వవిద్యాలయం (సోమపుర మహావిహర)**

సోంపురా విశ్వవిద్యాలయాన్ని కూడా పాల రాజవంశం రాజులు స్థాపించారు. దీనిని సోంపురా మహావిహర అని పిలిచే వారు. ఈ విశ్వవిద్యాలయం ఎనిమిదవ శతాబ్దం నుండి 12వ శతాబ్దం మధ్య 400 సంవత్సరాలు చాలా ప్రసిద్ధి చెందింది. ఈ విశ్వవిద్యాలయం 27 ఎకరాలలో విస్తరించి ఉంది. ఆ సమయంలో ప్రపంచంలో బౌద్ధమతం బోధించడానికి ఇది ఉత్తమ కేంద్రం.

**7. పుష్పగిరి విశ్వవిద్యాలయం**

పుష్పగిరి విశ్వవిద్యాలయం ప్రస్తుత భారతదేశంలోని ఒరిస్సాలో ఉండేది. దీనిని మూడవ శతాబ్దంలో కళింగ రాజులు స్థాపించారు.తరువాతి 800 సంవత్సరాలు, 11 వ శతాబ్దం, ఈ విశ్వవిద్యాలయం అభివృద్ధి తారాస్థాయికి చేరుకుంది. ఈ విశ్వవిద్యాలయం యొక్క ప్రాంగణం చలలిత్ గిరి, రత్న గిరి మరియు ఉదయగిరి అనే మూడు పర్వతాలలో విస్తరించి ఉంది.

నలంద, తశక్షిళ మరియు విక్రమాశిల తరువాత ఈ విశ్వవిద్యాలయం చాలా ముఖ్యమైన విద్యా కేంద్రంగా ఉండేది. చైనా యాత్రికుడు ఎక్సున్ జెంగ్ దీనిని బౌద్ధ విద్య యొక్క పురాతన కేంద్రంగా భావించారు. కొందరు చరిత్రకారులు ఈ విశ్వవిద్యాలయాన్ని అశోక రాజు స్థాపించారని నమ్ముతారు.

ఇతర విశ్వవిద్యాలయాలు ఈ విశ్వవిద్యాలయాలు కాకుండా, ప్రాచీన భారతదేశంలో మరెన్నో విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. వాటి విద్యావ్యవస్థ కూడా ఈ విశ్వవిద్యాలయాలచే ప్రభావితమైంది. చరిత్రలో కనిపించే వివరణ ప్రకారం, విద్య మరియు విద్యా కేంద్రాల స్థాపనను పాల రాజవంశం పాలకులు ఎక్కువగా ప్రోత్సహించారు.

**8. పశ్చిమ బెంగాల్‌లోని జగద్దాల**

(పాల రాజుల కాలం నుండి భారతదేశంలో అరబ్బులు వచ్చే వరకు)

**9. నాగార్జునకొండ, ఆంధ్రప్రదేశ్.**

**10. ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసి** (8 వ శతాబ్దం నుండి ఆధునిక కాలం వరకు),

**11. కాంచీపురం, తమిళనాడు,**

**12. మణిఖేట్, కర్ణాటక,**

**13. కాశ్మీర్‌లోని శారదా పీఠ్.**

ఈస్ట్ కోస్ట్ రైల్వే
టెండరు ప్రకటన నెం. WAT-TRD-58-23-24DT050124
పని పేరు మరియు ప్రదేశం: వాల్తేరు డివిజన్‌లోని పద్దెనిమిది (18) ట్రాక్షన్ సబ్-స్టేషన్స్ కొరకు మూడు సంవత్సరల కాలంనకు TSS ఆపరేషన్స్ యొక్క అవుట్ సోర్సింగ్.
టెండరు విలువ: ₹2,58,83,712/-, బయానా: ₹ 2,79,400/-, టెండరు ఫారం ఖరీదు: ₹5,900/-, పని పూర్తి చేయు కాలం: LOA తేదీ నుండి 36 నెలలు.
టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 29.01.2024న 1500 గంటలు.
టెండరు పూర్తి సమాచారం లభించు వెబ్‌సైట్: www.ireps.gov.in
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు (TRD), వాల్తేరు
PR-974/O/23-24

# మండల జనసేన పార్టీ వీర మహిళల కమిటీ ఏర్పాటు

**రాంబిల్లి, (విశాఖ సమాచారమ్):** నియోజకవర్గ జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం అచ్చుతాపురం మండల వీరమహిళా కమిటీని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ సుందరపు విజయకుమార్ అధ్యక్షతన నియమించినట్లు అచ్యుతాపురం పార్టీ అధ్యక్షులు బయలుపూడి శ్రీరామదాసు తెలిపారు. ఈ కమిటీలో మండల అధ్యక్షురాలుగా గొర్లి మంగతల్లి, ప్రధాన కార్యదర్శిగా కదిరి సత్యవతి, తదితరులు కమిటీలో ఉన్నారు. ఈ సందర్భంగా సుందరపు విజయకుమార్ కమిటీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మహిళా విభాగం ముందుండి జనసేన పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. జనసేన పార్టీలో మహిళలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు మోటూరు శ్రీవేణి, రేఖారాజు, జనసేన నాయకులు శరగడం నాగార్జున, పప్పల రమణ, అగ్గాల భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఒక చారిత్రాత్మక నిర్ణయం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రభుత్వ ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఒక చారిత్రాత్మక నిర్ణయమని, ప్రజలకు భూమిపై సంపూర్ణ హక్కును ఈ ప్రభుత్వం కల్పించిందని రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. సొంత భూమి కలిగిన ప్రతి ఒక్కరూ దానిపై పూర్తి హక్కులు కలిగి ఉండాలని, దానికి ఈ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. శుక్రవారం ఉదయం గాజువాక నియోజకవర్గం బీసీ రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ పట్టాలు, ఉక్కు కర్మాగార నిర్వాసితులకు మరియు ఫార్మాసిటీ భూనిర్వాసితులకు ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన టీటీడీ మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డితో కలిసి పాల్గొని పట్టాల పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖలో అమలు చేసిన వివిధ పథకాల ఉద్దేశాలను, లక్ష్యాలను వివరించారు.

ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకమని, గత ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని అన్నారు. భూమి కలిగిన ప్రతి లబ్ధిదారుడు దానిపై పూర్తి హక్కులు కలిగి ఉన్నప్పుడే అతనికి సమాజంలో మెరుగైన స్థితి ఉంటుందని అన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి ప్రభుత్వ భూమిని ఆక్రమించి దానిలో ఇండ్లను నిర్మించుకున్న ప్రజలకు ఇప్పటివరకు ఎటువంటి హక్కులు గత ప్రభుత్వాలు కల్పించలేదని, కానీ ఈ ప్రభుత్వ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృఢ సంకల్పంతో దానిపై శాశ్వత హక్కులు కల్పించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని, దానిలో భాగంగా ఈ రోజు ప్రజలకు పూర్తి హక్కులతో రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇండ్ల స్థలాలు అందించడంతో పాటు శాశ్వత భూమి పట్టాలు అందించి వారికి ఇండ్ల నిర్మాణానికి ఈ ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. ఈ ప్రభుత్వం ప్రారంభం నుంచి ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించిందని పేర్కొన్నారు.

అదే విధంగా ప్రభుత్వం ఈ మధ్య కాలంలో తీసుకువచ్చిన ల్యాండ్ టైటలింగ్ చట్టం గురించి ఆందోళన చెందవద్దని పిలుపు నిచ్చారు. భారతదేశంలో భూమిపై హక్కులు అనే విధానంపై గతంలో అనేక ప్రయత్నాలు జరిగాయని మంత్రి అన్నారు. అనేక అధ్యయనాలు తరువాత భావి తరాలకు భూమిపై పూర్తి సంపూర్ణ హక్కులు కోసం చేపట్టామని వివరించారు. ఇప్పటికిప్పుడు చట్టాన్ని ఆగమేఘాల మీద అమలు చేయడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నో ఏళ్లుగా దేశ వ్యాప్తంగా టైటిలింగ్ యాక్ట్ తీసుకురావడానికి ప్లానింగ్ కమిషన్ ద్వారా అధ్యయనం చేస్తోందని అన్నారు. భూమిపై పెట్టుబడి పెట్టి ప్రాజెక్టులు మొదలు చేసేలోపు కొన్ని వివాదాలు తలెత్తుతున్నాయని చెప్పారు. అందుకే దేశవ్యాప్తంగా 2019లోనే టైటిల్ గ్యారెంటీ చట్టాన్ని తీసుకురావాలని కేంద్రప్రభుత్వం ప్రయత్నించిందని ఆయన అన్నారు. అన్నీ చట్ట ప్రకారం జరుగుతాయని, న్యాయస్థానాలు ఇచ్చే సలహాలు తీసుకుంటామని చెప్పారు. ఇంకా ఎలాంటి రూల్స్ విధించాలో కసరత్తు జరుగుతోందని తెలిపారు. భారత ప్రభుత్వం అధ్యయనం చేసిన అంశాల్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే చేపట్టిందని పేర్కొన్నారు. ఈ చట్టం పూర్తి స్థాయి అమలుకు అందరి సలహాలు పాటిస్తామని అన్నారు.

రాష్ట్రంలో 17 వేల గ్రామాల్లో రెవెన్యూ రికార్డుల అప్డేషన్, సర్వే జరుగుతున్నాయని చెప్పారు. వివాదాలు లేని రికార్డులు తయారవుతాయని చెప్పారు. ప్రపంచంలోనే అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగిస్తున్నామని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఏపీలో జరుగుతున్న సర్వే గురించి తెలుసుకుంటున్నారని అన్నారు. రికార్డులన్నీ అప్ డేట్ అయ్యాక, సర్వే పూర్తయ్యాక చట్టం నోటిపై చేస్తామని చెప్పారు. ఇదంతా అయ్యేందుకు కొన్ని నెలల సమయం పడుతుందని పేర్కొన్నారు.

టీటీడీ మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత 30 నుంచి 40 సంవత్సరాలుగా పరిష్కారం కానీ భూ సమస్యలను ఈ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రజలకు భూమిపై సంపూర్ణ హక్కులు కల్పించేందుకు పూర్తి చర్యలు చేపట్టిందని అన్నారు. గాజువాక హౌసింగ్ సొసైటీ భూ సమస్యల పరిష్కారంలో స్థానిక ఎమ్మెల్యే చొరవతో శాశ్వతంగా పరిష్కారం చేశామని పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆక్రమిత భూములను రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ ప్రభుత్వం చేపట్టిందని, గత ప్రభుత్వాలు ఎందుకూ ఉపయోగం లేని పట్టాలు అందించి ప్రజలను మోసం చేశాయని అన్నారు. ప్రజలకు ఇంత గొప్ప ఆస్తిని అందించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ మల్లికార్జున మాట్లాడుతూ గాజువాక హౌసింగ్ సొసైటీ మరియు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆక్రమిత భూములు యొక్క రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి ఈరోజు కన్వేయన్స్ డీడ్స్ ప్రజలకు అందించడం ఎంతో శుభ పరిణామం అని పేర్కొన్నారు. భూమిపై శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చిరకాలం గుర్తు ఉంటుందని అన్నారు. ఈరోజు ఇక్కడ గాజువాక హౌసింగ్ సొసైటీ ద్వారా ప్రభుత్వ ఆక్రమిత భూములలో నివాసం ఉంటున్న 7026 మందికి కన్వేయన్స్ డీడ్స్‌ని అందించుట కోసం చర్యలు చేపట్టామని అన్నారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆక్రమిత భూముల్లో నివాసం ఉంటున్న మరొక 6260 మందికి కూడా కన్వెన్షన్ డీడీలు ప్రక్రియ పూర్తి చేసామని తెలిపారు. అదేవిధంగా 39 మంది ఉక్కు కర్మాగార నిర్వాసితులకు కన్వేయన్స్ పట్టాలు, 40 మంది ఫార్మాసిటీ భూనిర్వాసితులకు ఇండ్ల పట్టాల పంపిణీ చేస్తున్నామని వివరించారు.

గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న గాజువాక హౌసింగ్ సొసైటీ భూములకు శాశ్వత పరిష్కారం చూపిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈరోజు సుమారు మొత్తం 1500 కోట్ల రూపాయల విలువ గల భూమిని ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన అందించడం ఎంతో శుభ పరిణామం అని పేర్కొన్నారు. గాజువాకలో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఇండ్లలో నివాసం ఉంటున్న వారికి వాటిపై ఎటువంటి శాశ్వత హక్కులు లేవని ముఖ్యమంత్రి చొరవతో దీనికి శాశ్వత పరిష్కారం ఈ ప్రభుత్వ హయాంలో చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.

కార్యక్రమంలో ముందుగా రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు టీటీడీ మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అదీప్ రాజు, స్థానిక కార్పొరేటర్లు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కార్యక్రమం అనంతరం లబ్ధిదారులకు రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు టీటీడీ మాజీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, స్థానిక కార్పొరేటర్లతో కలిసి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డిసిఎమ్ఎస్ చైర్ పర్సన్ పల్లా చినతల్లి, గాజువాక నియోజకవర్గం ఇన్చార్జి ఊరకుటి రామచంద్ర రావు, మాజీ ఎమ్మెల్యేలు గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరమణ, స్థానిక కార్పొరేటర్లు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ జోనల్ కమిషనర్, రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# స్థాయీ సంఘం సమావేశంలో అభివృద్ధి పనులకు ఆమోదం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ స్థాయీ సంఘం సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ చైర్ పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన స్థాయీ సంఘ సభ్యులతో జివిఎంసి స్థాయీ సంఘం సమావేశ మందిరములో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ స్థాయీ సంఘం పొందుపరిచిన అజెండాలో 38 అంశాలతో పాటు టేబుల్ అజెండాలో 17 అంశాలు పొందుపరచగా మొత్తంగా 55 అంశాలను స్థాయీ సంఘ సభ్యులు చర్చించి అన్ని అంశాలను ఆమోదించడమైనదని చైర్ పర్సన్ తెలిపారు. అలాగే ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.4.32 కోట్లు అభివృద్ధి పనులకు, ప్రజా ఆరోగ్య విభాగానికి సంబంధించి పలు కార్యక్రమాలకు, అదనపు కార్మికులను తాత్కాలికంగా సేవలు వినియోగించుకొనుటకు, ఇతర కార్యక్రమముల కొరకు సుమారు రూ.1.37 కోట్లు రెవెన్యూ విభాగానికి సంబంధించి లీజులు పొడిగింపు, మొదలైన అంశాలతో కలిపి మొత్తం 55 అంశాలను సభ్యులు ఆమోదించడమైనదన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో జాతీయ స్థాయిలో విశాఖపట్నానికి 4వ ర్యాంకు వచ్చినందుకు సహకరించిన విశాఖ నగర ప్రజలకు, డిప్యూటీ మేయర్లకు, స్థాయీ సంఘ సభ్యులకు, ఫ్లోర్ లీడర్లకు, కార్పొరేటర్లకు, పారిశుధ్య కార్మికులకు, జీవీఎంసీ అన్ని విభాగాల అధికారులకు, ఉద్యోగులకు, స్వచ్ఛంద సంస్థలకు, నివాసిత సంక్షేమ సంఘ సభ్యులకు, స్వచ్ఛభారత్ అంబాసిడర్లకు, సినీ, క్రీడా ప్రముఖులకు మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నగర మేయర్ సారథ్యంలో విశాఖ నగరానికి 4వ ర్యాంకు సాధనకు కృషి చేసిన మేయర్‌కు స్థాయీ సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులతో పాటు కార్యదర్శి పి.నల్లనయ్య, డి.సి(రెవెన్యూ) ఫణిరామ్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, 5వ జోనల్ కమీషనరు ఆర్.జి.వి.క్రిష్ణ, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆదినారాయణ, కార్యనిర్వాహక ఇంజనీర్లు సంతోషి కుమారి, తారాప్రసన్న, రమణమూర్తి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసరు పద్మజ, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ విద్యార్థులు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం వలంటీర్లు జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికయ్యారు. వీరిని ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలలో భాగం కావడం వలన విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. సమూహంగా పనిచేయడం, కార్యసాధక నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు తమ నైపున్యాలను, సామర్థ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏయూ జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, జిల్లా ప్రోగ్రా అధికారిణి ఇ.పి.ఎస్ భాగ్యలక్ష్మి, ప్రోగ్రాం అధికారిణి అనసూయ తదితరులు పాల్గొన్నారు. ఏయూ పరిధిలోని జీవీపీ కళాశాల విద్యార్థిని జి.కావ్య దేవి, డాక్టర్ వి.ఎస్ కృష్ణ కళాశాల విద్యార్థిని ఏ.చూడామణి, ఏయూ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి వి.రామ రాజు, టిఎస్ఆర్-టిబికె డిగ్రీ కళాశాల విద్యార్థి వై.విశ్వమోహన్‌లు హైదరాబద్‌లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొంటారు.

# సంక్షేమ సారథి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరల ఆశీర్వదించండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రతి గడపగడపకు సంక్షేమం ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని విశాఖ పార్లమెంట్ సభ్యులు తూర్పు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త ఎం.వి.వి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు 20వరోజు శుక్రవారం 92, 98వ సచివాలయం పరిధి వాసవానిపాలెం, మూలపాలెం, గోవా గార్డెన్స్, గొల్ల వీధి ప్రాంతాలలో పాదయాత్ర వార్డు వైసిపి ఇన్చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి శంకర్‌తో కలిసి నిర్వహించామని, ప్రతి గడపగడపకు వెళ్లి స్థానిక సమస్యలను అడిగితెలుసుకున్నామన్నారు.

ఎంవివి సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభత్వం హయాంలో అరకొర పెన్షన్ ఇచ్చేవారని అదికూడా ఎప్పుడు వస్తుందో, ఎవరికీ వస్తుందో తెలియని పరిస్థితి వుండేదని కానీ మన ముఖ్యమంత్రి వర్యులు వై.యస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మేరకు 2000 నుండి 3000 వరకు ప్రతీ ఏటా పెంచుతూ వచ్చిందని అదీకూడ సూర్యోదయానికి ముందే లబ్ధిదారుల ఇంటికి వాలెంటీర్ ద్వారా ఈ ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 69 లక్షల మంది లబ్ధిదారులకు ఈ ప్రభుత్వం పించన్ అందజేస్తుందని. గత ప్రభుత్వ హాయంలో ఇది 39లక్షలు మంది లబ్ధిదారులకు మాత్రమే ఇచ్చేవారని అన్నారు. కావున వచ్చే ఎన్నికలలో మీ అందరి దీవెనలు, మీ అందరి మద్దతు అందజేసి వై.యస్ జగన్మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. 20రోజుల నుండి ప్రజాసమస్యలు తెలుసుకొనందుకు పాదయాత్ర చేస్తున్నామని అన్నారు. ఈరోజు ప్రతి గడపగడపకు వెళ్లిపాదయాత్రగా వెళ్లి వారి వారి సమస్యలను అడగగా అప్యాయతగా పలకరిస్తూ రానున్న కాలంలో మరల ఏపీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించే దిశగా మద్దతుపలుకుతున్నారన్నారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు మొల్లిఅప్పారావు, కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్ చంద్ర, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఆళ్ల శివ గణేష్,చొక్కర శేఖర్ రావు, అల్లంపల్లి రాజబాబు,గరికిన ధనలక్ష్మి, వాసుపల్లి ఎల్లాజీ, వాసుపల్లి అప్పన్న, వాసుపల్లి చంటి, కంబాల గొర్లయ్య, ఆకుల శ్రీను, మారుపల్లి పరదేశి, మజ్జి జ్యోతి, కోడా గురయ్యా, జీవీజీ సురేష్,రమణమూర్తి, సొసైటీ ప్రెసిడెంట్ మారుపల్లి పరదేశి, వాసుపల్లి సత్తయ్య, డీ ఈశ్వరరావు, గ్రామ పెద్దలు, కన్వీనర్లు అధిక సంఖ్యలో మహిళలు పార్టీ శ్రేణులు, అభిమానులు, పలు కార్పోరేషన్ డైరెక్టర్లు చైర్మన్లు వివిధ అనుబంధ సంఘాల నాయకులు పార్టీ శ్రేణులు మహిళలు పాల్గొన్నారు.

# దగ్గు మందు తీసుకునే ముందు ఈ విషయాలు తెలుసుకోండి



చలికాలం కావడంతో చాలా మంది జలుబు, దగ్గుతో బాధపడుతున్నారు. జలుబు మరియు దగ్గు సమస్యలకు, కొందరు వ్యక్తులు వెంటనే సొంత వైద్య నివారణలను చేస్తుంటారు. మరికొందరు ఇప్పటికే డాక్టర్ సూచించిన దగ్గు మందులను కొని తాగుతున్నారు.

ఇక ఇప్పుడు షాపుల్లో కూడా చాలా దగ్గు మందులు అమ్ముతున్నారు. దగ్గు మందులు శ్వాసకోశంలోని శ్లేష్మాన్ని వదులుతాయి, కండరాలకు విశ్రాంతినిస్తాయి మరియు మీరు సులభంగా శ్వాస తీసుకోవడంలో సహాయపడతాయి.

సాధారణంగా దగ్గు సమస్య వచ్చినప్పుడు కఫం బయటకు వస్తుంది. కఫం బయటకు వచ్చినప్పుడు, శ్వాసనాళాలు మరియు ఊపిరితిత్తులు శుభ్రంగా ఉంటాయి. ఊపిరితిత్తులలో శ్లేష్మం ఎక్కువగా ఉంటే, ఫలితంగా, మీరు ఛాతీ రద్దీ మరియు ముక్కు మూసుకుపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటారు.

ఇలా ఉన్నప్పుడు ఆ వ్యక్తి చాలా అలసిపోవడం మరియు మీరు నిరంతర దగ్గును ఎదుర్కొన్నప్పుడు గొంతు నొప్పికి కారణమవుతుంది. దీర్ఘకాలిక దగ్గు సమస్య ఊపిరితిత్తులు మరియు ఛాతీ కండరాలపై ఒత్తిడిని పెంచుతుంది, కొంత నొప్పిని కలిగిస్తుంది.

కాబట్టి గొంతు ప్రాంతాన్ని సడలించడానికి మరియు దగ్గు సమస్య నుండి ఉపశమనం పొందడానికి దగ్గు ఔషధాన్ని ఉపయోగిస్తారు. ఎందుకంటే దగ్గు మందులలో డెక్స్ట్రోమెథోర్ఫాన్ లేదా DXM అనే సమ్మేళనం ఉంటుంది. ఇది మెదడు యొక్క కేంద్ర భాగాన్ని ప్రభావితం చేస్తుంది మరియు దగ్గును నియంత్రిస్తుంది. ఈ సమ్మేళనం వాపుకు కారణమయ్యే హిస్టామిన్ల ప్రభావాలను నిరోధించడంలో కూడా సహాయపడుతుంది.

DXM మొత్తం ఒకరి శరీర బరువుపై ఆధారపడి ఉంటుంది. పెద్దలు 15-20 mg రోజుకు రెండుసార్లు తీసుకోవాలని సూచించారు. కానీ నియంత్రణ లేకుండా, ఒకరు ఎక్కువ DXM తీసుకుంటే, అది భ్రాంతులు మరియు ఆనందం యొక్క భావాలను కలిగిస్తుంది. మరింత తీవ్రమైన సందర్భాల్లో, ఇది ఒకరి ప్రాణానికి కూడా ప్రమాదం కలిగిస్తుంది.

**భయంకరమైన దుష్ప్రభావాలు**

ఎవరైనా DXM ఉన్న దగ్గు మందులను ఎక్కువగా తీసుకుంటే, అది ప్రమాదకరమైన ప్రవర్తనకు దారితీసే ఒకరి మానసిక స్థితిని ఊహించలేకుండా చేస్తుంది. అది కూడా ఎక్కువ కాలం దగ్గు మందు వాడితే ఏదో ఒక సమయంలో అది వ్యసనంగా మారి మొత్తం శ్రేయస్సును ప్రభావితం చేస్తుంది. అదనంగా, కొంతమందిలో, దగ్గు ఔషధం యొక్క అధిక మోతాదు మూర్ఛలకు కారణమవుతుంది మరియు పరిస్థితిని మరింత దిగజార్చవచ్చు. దగ్గు చుక్కలపై అధిక మోతాదు యొక్క ఇతర ప్రతికూల ప్రభావాలు:

గుండె నిమిషానికి 100 బీట్ల కంటే వేగంగా కొట్టుకుంటుంది.

మానసిక వ్యాధితో బాధపడవచ్చు.

కళ్లు వణుకుతాయి

**ఊపిరాడకుండా ఉంటుంది**

కండరాల కణజాలం విచ్ఛిన్నం కావచ్చు మరియు మూత్రపిండాల వైఫల్యానికి కారణం కావచ్చు.

అదనంగా, దగ్గు మందులలోని కొన్ని పదార్థాలు హృదయ స్పందన రేటును పెంచుతాయి, దడ, నరాలపై ప్రభావం చూపుతాయి మరియు అధిక రక్తపోటును కలిగిస్తాయి. అలా కాకుండా, మీరు కడుపు నొప్పి, పెద్దప్రేగు దెబ్బతినడం, చర్మంపై ఎర్రటి దద్దుర్లు అనుభవించవచ్చు. ప్రత్యేకించి DXM 600 mg లేదా అంతకంటే ఎక్కువ మోతాదులో తీసుకున్నప్పుడు, అది ఏదో ఒక సమయంలో కోమాకు మరియు మరణానికి కూడా దారి తీస్తుంది.

కాబట్టి మీకు లేదా మీ పిల్లలకు జలుబు దగ్గు ఉంటే, మీరు దగ్గుకు మందులు ఇవ్వకండి, డాక్టర్ వద్దకు వెళ్లి ఆయన సూచించిన విధంగా మాత్రమే దగ్గు మందులు తీసుకోండి.

# కిడ్నీలో రాళ్లను నివారించడం ఎలా...!




మనం మన ఆరోగ్యం విషయంలో ఎంత జాగ్రత్తగా ఉన్నా, ఏదో ఒక మూల నుండి మనకు అనారోగ్యం వస్తుంది. ఇలా మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా మనకు తెలియకుండానే కిడ్నీ స్టోన్ లేదా కిడ్నీలో రాళ్ళు ఏర్పడవచ్చు. కిడ్నీలో రాళ్లలో లక్షణాలు లేకపోవడం వల్ల, వ్యాధి పెద్దదయ్యే వరకు కూడా రోగికి హెచ్చరిక అందదు.

కాబట్టి కిడ్నీ రాళ్ల ప్రమాదాన్ని తగ్గించుకోవడానికి మనం ఏమి చేయాలి? మనల్ని మనం కిడ్నీ స్టోన్స్ ను తొలగించుకోవడం ఎలా? కిడ్నీలో రాళ్లు ఏర్పడటానికి దారితీసే కారకాల గురించి తెలుసుకోండి.

కిడ్నీ స్టోన్స్, కిడ్నీలో గట్టి నిక్షేపాలు, కాల్షియం ఆక్సలేట్, యూరిక్ యాసిడ్, స్ట్రువైట్ మరియు సిస్టీన్ రకాలు ఉన్నాయి. మీ మూత్రంలో అనేక వ్యర్థ పదార్థాలు ఉంటాయి. వ్యర్థాల పరిమాణం చాలా ఎక్కువగా ఉన్నప్పుడు మరియు ద్రవం చాలా తక్కువగా మారినప్పుడు, స్ఫటికాలు ఏర్పడటం ప్రారంభమవుతుంది. ఈ స్ఫటికాలు చివరికి మూత్రపిండాల్లో రాళ్లను ఏర్పరుస్తాయి. ప్రారంభంలో, రాళ్లను తక్కువ మొత్తంలో ఔషధంతో నాశనం చేయవచ్చు. కానీ దీర్ఘకాలిక వ్యాధి అయితే శస్త్రచికిత్స అవసరం అవుతుంది.

మూత్రపిండ కాలిక్యులి, నెఫ్రోలిథియాసిస్ లేదా యురోలిథియాసిస్ అని కూడా పిలువబడే కిడ్నీ రాళ్ళు ఖనిజాలు మరియు లవణాలతో తయారవుతాయి. అవి కిడ్నీ లోపల ఏర్పడి గట్టిపడతాయి. నేషనల్ కిడ్నీ ఫౌండేషన్ ప్రకారం, "కిడ్నీ స్టోన్స్‌లో నాలుగు రకాలు ఉన్నాయి: కాల్షియం ఆక్సలేట్, యూరిక్ యాసిడ్, స్ట్రువైట్ మరియు సిస్టీన్. కిడ్నీ రాళ్లను షాక్‌వేవ్ లిథోట్రిప్సీ, హిస్టెరెక్టమీ, పెర్క్యుటేనియస్ నెఫ్రోలిథోటోమీ లేదా నెఫ్రోలిథోట్రిప్సీ వంటి తీవ్రమైన లక్షణాలతో చికిత్స చేయడం ద్వారా నాశనం చేయవచ్చు. వీపు కింది భాగంలో నొప్పి, మీ మూత్రంలో రక్తం, వికారం, వాంతులు, జ్వరం మరియు చలి, లేదా దుర్వాసన లేదా గోధుమ రంగు మూత్రం.

మీ మూత్రంలో అనేక వ్యర్థ పదార్థాలు ఉంటాయి. వ్యర్థాల పరిమాణం చాలా ఎక్కువగా ఉన్నప్పుడు మరియు ద్రవం చాలా తక్కువగా మారినప్పుడు, స్ఫటికాలు ఏర్పడటం ప్రారంభమవుతుంది. "ఈ స్ఫటికం లాంటి నిర్మాణం ఇతర మూలకాలను ఆకర్షిస్తుంది మరియు శరీరం నుండి మూత్రంతో విసర్జించబడకపోతే పెద్దదిగా పెరుగుతుంది.

మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా నిరోధించడానికి అనేక మార్గాలు ఉన్నాయి

**రోజూ 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి**

ఫోర్టిస్ హిరానందానీ హాస్పిటల్‌లోని నెఫ్రాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ అతుల్ ఇంగేల్, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ మరియు ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్, వాషి ప్రకారం, "ఒక వ్యక్తిలో కిడ్నీలో రాళ్ల యొక్క ప్రత్యేకత ఏమిటంటే అవి అభివృద్ధి చెందితే రాబోయే 5 సంవత్సరాలలో పునరావృతమయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. రాళ్లు ఏర్పడకుండా ఉండేందుకు రోజూ 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి.రాళ్ల నిర్మాణంలో డైట్ కూడా పాత్ర పోషిస్తుంది, మాంసాహారులు రాళ్లు వచ్చే ప్రమాదం ఉంది.ఆరోగ్యకరమైన ఆహారాన్ని అనుసరించి, ప్యాకింగ్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండాలి. .

**ఉప్పు మితంగా వాడాలి**

కిడ్నీలో రాళ్లు పెరగడానికి సోడియం కూడా కారణం. ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల ఈ రాళ్లు బలంగా పెరుగుతాయి. ఈ క్రిస్టల్ ఉప్పును ఆకర్షిస్తుంది.

**మాంసాన్ని మితంగా తినండి**

రెడ్ మీట్ మరియు పౌల్ట్రీ వినియోగం మితంగా ఉండాలి. రోజూ పుష్కలంగా పండ్లు మరియు కూరగాయలు తినడం వల్ల రాళ్ళు ఏర్పడటం తగ్గుతుంది, ఎందుకంటే వాటిలో సిట్రేట్ ఉంటుంది, ఇది కిడ్నీలో కాల్షియం పేరుకుపోకుండా చేస్తుంది.

# ఉత్తరం నుండి దక్షిణ భారతదేశం వరకు, ఈ వంటకాలు మకర సంక్రాంతికి ప్రసిద్ధ వంటకాలు



మకర సంక్రాంతి పండుగను భారతదేశంలోనే కాకుండా నేపాల్, బంగ్లాదేశ్ మరియు శ్రీలంకలో కూడా జరుపుకుంటారు. ఈ పండుగ ప్రత్యేకత ఏమిటంటే, దేశంలోని ప్రతి రాష్ట్రంలో వివిధ పేర్లతో వైభవంగా జరుపుకునే ఏకైక పండుగ ఇదే. సంక్రాంతిని పంజాబ్‌లో లోహ్రీ అని, అస్సాంలో భోగాలీ బిహు అని, ఆంధ్ర ప్రదేశ్ మరియు తమిళనాడులో పొంగల్ అని మరియు గుజరాత్‌లో ఉత్తరాయణం అని పిలుస్తారు.

ఇప్పుడు పేరు వేరు కాబట్టి ఈ రోజున తయారుచేసే స్పెషల్ డిష్ కూడా డిఫరెంట్ గా ఉంటుందనేది సుస్పష్టం. నువ్వుల లడ్డూ మరియు ఖిచ్డీ కాకుండా, భారతదేశంలోని వివిధ నగరాల్లో ఈ రోజున సాంప్రదాయ వంటకాలు తయారుచేస్తారు. ఈ రోజున ఏయే రాష్ట్రాల్లో ప్రత్యేక వంటకాలు తయారు చేస్తారో ఈ సందర్భంగా తెలుసుకుందాం. దేశంలోని 15 రాష్ట్రాలలో సంక్రాంతి రోజు ప్రత్యేకత ఏమిటో మీకు తెలియజేస్తున్నాం...

**దక్షిణాసియా వంటకాలలో బియ్యం మరియు పప్పుతో చేసిన వంటకం**

మకర సక్రాంతిని చాలా ప్రాంతాల్లో ఖిచ్డీ పండుగ అంటారు. ఈ రోజున ఖిచ్డీని ఖచ్చితంగా తయారు చేస్తారు. చాలా ప్రాంతాలలో, ఈ రోజున, ఉరద్ ఖిచ్డీ మరియు చాలా చోట్ల బంగాళదుంపలు, బఠానీలు, క్యాబేజీ వంటి కాలానుగుణ కూరగాయలతో తయారు చేసిన కిచడీని దేవునికి నైవేద్యంగా తింటారు.

**నువ్వుల లడ్డూలు**

నువ్వులు మరియు బెల్లం మకర సంక్రాంతికి ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉంటాయి. భారతదేశంలోని అనేక రాష్ట్రాల్లో, నువ్వులు మరియు బెల్లంతో చేసిన వంటకాలు, ముఖ్యంగా నువ్వుల లడ్డూలను ఈ రోజున తయారుచేస్తారు. నువ్వుల లడ్డూలను ఉత్తర భారతదేశంలోని దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ తయారు చేస్తారు. దీనిని వివిధ పేర్లతో పిలుస్తారు. ఉత్తరప్రదేశ్, బీహార్ మరియు జార్ఖండ్‌లోని కొన్ని ప్రదేశాలలో తిల్వా కూడా అంటారు. కర్ణాటకలో ఇల్లు బెల్ల అంటారు. మహారాష్ట్రలో నువ్వుల లడ్డూలు తినిపించేటప్పుడు ఒక వాక్యం చెబుతారు. 'తిల్-గుల్ ఘ్యా, ఆనీ గాడ్-గాడ్ బోలా', అంటే 'నువ్వులు మరియు బెల్లం తిని బాగా మాట్లాడండి'.

**దహి-చుడా**

భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాలలో మకర సక్రాంతి సందర్భంగా, బీహార్ మరియు యుపిలోని అనేక ప్రదేశాలలో పెరుగు-చూడా తినే సంప్రదాయం ఉంది.

**తాలెర్ పులూరి**

మకర సంక్రాంతి అనేది బెంగాలీలో పౌష్-పర్బన్ అని పిలువబడే బెంగాలీల పౌష్ పండుగ. ఈ సందర్భంగా ఇక్కడ వివిధ రకాల వంటకాలు తయారుచేస్తారు. ఈ వంటలలో ఒకటి తాలెర్ పూలూరి. దీనిని బెంగాల్‌లో తాలెర్ బోరా అని కూడా పిలుస్తారు. ఇది గోధుమ పిండి, సెమోలినా మరియు బియ్యప్పిండిని కలిపి తయారు చేసే ఒక రకమైన తీపి చిరుతిండి.

**ఘుఘుటియా, ఉత్తరాఖండ్**

ఉత్తరాఖండ్‌లో, సంక్రాంతి రోజున తయారుచేసే ప్రత్యేక వంటకాన్ని ఘుఘుతీయ అంటారు. ఇది పిండి మరియు బెల్లం మిశ్రమంతో కలుపుతారు మరియు దానిమ్మ పువ్వులు, కత్తులు, పొడవాటి స్పైరల్స్ మొదలైన వివిధ ఆకృతులలో తయారు చేస్తారు. ఆ తర్వాత వాటిని నెయ్యిలో వేయించి, వాటితో పూలమాలలు తయారు చేసి ఈ దండను పిల్లలకు ధరిస్తారు. అప్పుడు ఈ తీపిని పక్షులకు కూడా తినిపిస్తారు.

**గజాక్, మధ్యప్రదేశ్**

మధ్యప్రదేశ్‌లో, మకర సంక్రాంతి గజకుని రుచితో జరుపుకుంటారు. నువ్వులు, జీడిపప్పు మరియు వేరుశెనగ, నెయ్యి మరియు పంచదారతో తయారుచేసిన గజక్ రుచిలో రుచికరమైనది మాత్రమే కాదు, చలికాలంలో ఆరోగ్యానికి కూడా ఉత్తమమైనది.

**చెరకు రసం ఖీర్, పంజాబ్**

పంజాబీ మకర సక్రాంతిలో లోహ్రీ అంటే అది లేకుండా అసంపూర్ణంగా ఉంటుంది. పంజాబ్‌లో చెరకును పెద్ద ఎత్తున సాగు చేస్తారు. దీని నుండి ఖీర్ తయారు చేస్తారు మరియు డ్రై ఫ్రూట్స్‌తో వడ్డిస్తారు.

**ఖండో, అస్సాం**

అస్సాంలో, సంక్రాంతిని బిహుగా జరుపుకుంటారు మరియు ఈ రోజున చేసే ప్రత్యేక వంటకాన్ని ఖండో అని పిలుస్తారు. దీన్ని అన్నం వేయించి, పెరుగు, బెల్లం, పాలు మరియు అనేక ఇతర వస్తువులను వేసి, సంక్రాంతి రోజున ఉదయాన్నే అల్పాహారంగా తింటారు.

**మకర్ చౌలా, ఒడిశా**

ఒడిశాలో, ప్రజలు మకర చౌలా తయారు చేయడం ద్వారా మకర సంక్రాంతిని జరుపుకుంటారు. ఇది బియ్యం పిండి, కొబ్బరి, పాలు, పండిన అరటిపండ్లు, చక్కెర, కాటేజ్ చీజ్, అల్లం, కారం పొడి మరియు దానిమ్మ గింజలు కలపడం ద్వారా తయారుచేస్తారు. ప్రసాదంగా కూడా పంచే ఆచారం ఉంది.

**పురాన్ పోలి, మహారాష్ట్ర**

మీరు పురాన్ పోలి రుచి చూడాలనుకుంటే, మకర సంక్రాంతి సందర్భంగా మహారాష్ట్రకు రావాలని ప్లాన్ చేసుకోండి. పప్పు మరియు బెల్లం పిండితో నింపబడి, రోటీలా చుట్టి, నెయ్యితో వండుతారు. తీపి మరియు పులుపు రుచి కలిగిన ఈ వంటకం ఇక్కడి ప్రజలకు ఇష్టమైన వంటలలో ఒకటి.

**ఎల్లు బేల, కర్ణాటక**

మకర సంక్రాంతి సందర్భంగా నువ్వుల లడ్డూలను బీహార్‌లోనే కాకుండా కర్ణాటకలో కూడా రుచి చూడవచ్చు. వాటిని మరింత రుచికరంగా చేయడానికి, నువ్వుల గింజలతో పాటు కొబ్బరి ముక్కలను కూడా కలుపుతారు. దగ్గరి బంధువులు మరియు పొరుగువారికి పంచుకునే సంప్రదాయ వంటకం కూడా ఉంది.

**ఉండీని**

గుజరాత్‌లో మకర సక్రాంతి సందర్భంగా ఉండీని తయారు చేసే ఆచారం ఉంది. ఈ వంటకంలో అనేక రకాల కాలానుగుణ కూరగాయలను ఉపయోగిస్తారు. ఇది హదీలో వండుతారు, ఇది దాని రుచిని రెట్టింపు చేస్తుంది. ఇది పూరీ మరియు బజ్రా రోటీతో వడ్డిస్తారు.

**బియ్యం పిఠా**

జార్ఖండ్ మరియు దాని చుట్టుపక్కల ప్రాంతాలలో, మకర సంక్రాంతి రోజున బియ్యప్పిండితో చేసిన ఒక ప్రత్యేక వంటకాన్ని బియ్యం పిఠా లాగా తింటారు.

**మురుక్కు, తమిళనాడు**

తమిళనాడులో సంక్రాంతిని పొంగల్‌గా జరుపుకుంటారు మరియు ఈ రోజున మురుక్కు తినే సంప్రదాయం ఉంది. ఉరద్ పప్పు, మైదా, కారమ్ గింజలు మరియు నువ్వులను కలిపి పిండిలా చేసి, ఆపై స్పైరల్స్‌గా ఏర్పడి డీప్ ఫ్రై చేయాలి. ఈ క్రిస్పీ నమ్కీన్ తినడానికి చాలా రుచిగా ఉంటుంది.

**కంగ్సుబి**

ఇది మణిపూర్‌లోని మకర సక్రాంతి నాడు తయారుచేసే వంటకం. కంగ్‌సుబి అనేది నువ్వులు మరియు చెరకు రసంతో తయారు చేసిన వంటకం, దీనిని కాల్చిన తర్వాత చిన్న ముక్కలుగా చేసి వడ్డిస్తారు.

# శీతా కాలంలో ఖర్జూరం తినాలి!



శీతా కాలం వచ్చిందంటే అనేక రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆరోగ్య పరంగా, చర్మం, జుట్టు పరంగా కేర్ తీసుకోవాలి. లేదంటే మన శరీరాన్ని మనం చూసుకోవడానికి చిరాకుగా అనిపిస్తుంది. చలి కాలంలో తప్పకుండా కేర్ తీసుకోవాలి. అదే విధంగా శరీరంలో రోగ నిరోధక శక్తి అస్సలు తగ్గకూడదు. లేదంటే వ్యాధులు ఎటాక్ చేసేస్తాయి. శీతా కాలంలో శరీరానికి మరింత శక్తిని ఇచ్చే ఫుడ్స్‌లో ఖర్జూరాలు కూడా ఒకటి.

ఖర్జూరాలు తీసుకుంటే తక్కువ సమయంలోనే ఎనర్జీ లెవల్స్ పెరుగుతాయి. ఇవి చాలా రుచిగా కూడా ఉంటాయి. 100 గ్రాముల ఖర్జూరాల్లో 144 క్యాలరీల శక్తి ఉంటుంది. అన్ని పండ్లులాగే ఇవి కూడా కాలానుగుణంగా కాస్తాయి. కానీ వీటిని కోల్డ్ స్టోరేజెస్‌లో నిల్వ చేసి సంవత్సరం అంతా దొరికేలా అమ్ముతారు.

మీరు చక్కెరకు బదులు స్వీట్ ఐటెమ్స్‌లో ఖర్జూరం పేస్ట్‌ని వాడుకోవచ్చు. దీని వల్ల ఆరోగ్యమే కాకుండా సైడ్ ఎఫెక్ట్స్ ఏమీ ఉండవు. జ్యూస్‌లు, పాలు, తీపి వంటకాల్లో ఈ ఖర్జూరాలను ఉపయోగించుకోవచ్చు. ఖర్జూరాలను నేరుగా తినడం ఇష్ట పడని వారు వీటిని.. వీటితో స్వీట్స్ కూడా తయారు చేసుకోవచ్చు.

ఖర్జూరాలను తింటే రక్త హీనత సమస్య తగ్గుతుంది. ఐరన్ లోపం రాకుండా ఉంటుంది. ముఖ్యంగా రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీని వల్ల సీజన్ల వారీగా వచ్చే జలుబు, దగ్గు, జ్వరం వంటివి రాకుండా ఉంటాయి. అదే విధంగా పలు దీర్ఘకాలిక వ్యాధులు కూడా రావని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

ఖర్జూరాలు తింటే చర్మానికి, జుట్టుకు కూడా మంచి పోషణ అందుతుంది. దీంతో చర్మం పొడి బారకుండా, జుట్టు రాలిపోకుండా ఉంటుంది. చలి కాలంలో డేట్స్ తింటే శరీరంలో వెచ్చగా ఉంటుంది. దీంతో చలి నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.

# జుట్టు ఒత్తుగా. పొడుగ్గా కావాలా?




అందమైన పొడవైన జుట్టు ఉండాలని అనుకోని వారుండరు. ముఖ్యంగా మహిళలకు జుట్టుతో చాలా ఎఫెక్షన్ ఉంటుంది. జుట్టు ఒత్తుగా, పొడుగ్గా ఉంటేనే మరింత అందంగా కనిపిస్తారు. పొడుగైన, ఒత్తైన జుట్టు కోసం ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. అలాగే మార్కెట్లో లభించే పలు రకాల ప్రొడెక్ట్స్‌ని వడుతూ ఉంటారు. కానీ వీటితో చాలా రకాల సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. కేవలం జుట్టే కాకుండా.. శరీరం కూడా ఆరోగ్యంగా ఉండాలంటే బాహ్య సంరక్షణ కాకుండా అంతర్గత పోషణ చాలా ముఖ్యం. జుట్టు పెరుగుదలలో, జుట్టు అందంగా, దృఢంగా కనిపించడంలో జింక్ ముఖ్య పాత్ర వహిస్తుంది. జింక్ తీసుకుంటే మంచి ఒత్తైన, పొడుగైన జుట్టు మీ సొంతం అవుతుంది. కనుక మీరు తీసుకునే ఆహారంలో జింక్ ఉండేలా చూసుకోండి. జింక్ ఎలాంటి ఆహార పదార్థాల్లో లభ్యమవుతుందో తెలుసుకుందాం.

**గుమ్మడి గింజలు:**

జింక్ ఎక్కువగా ఉండే ఆహార పదార్థాల్లో గుమ్మడి గింజలు కూడా ఒకటి. గుమ్మడి గింజల్లో అనేక రకాలైన పోషకాలు ఉంటాయి. వీటిల్లో జింక్ కూడా ఉంటుంది. గుమ్మడి గింజలు తీసుకుంటే.. జుట్టు ఒత్తుగా పెరగడంతో పాటు.. జీవ శక్తి కూడా మెరుగు పడుతుంది.

**ఆకు కూరలు:**

ఆకు కూరల్లో కూడా జింక్ మెండుగా ఉంటుంది. బచ్చలి కూర, ముదురు రంగు ఆకు కూరల్లో జింక్ ఎక్కువ శాతం ఉంటుంది. ఆకు కూరలు తీసుకోవడం వల్ల ఇతర ప్రయోజనాలు కూడా ఎన్నో ఉన్నాయి. ఇవి తీసుకోవడం వల్ల కూడా ఆరోగ్యకరమైన, పొడవైన జుట్టు మీ సొంతం అవుతుంది.

**పెరుగు:**

పెరుగులో ప్రోబయోటిక్స్‌తో పాటు జింక్ కూడా ఉంటుంది. పెరుగు తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. పెరుగును తీసుకుంటే మంచి పోషణ అంది.. బలంగా తయారవుతుంది. అదే విధంగా స్మూత్‌గా ఉంటుంది. పెరుగు తీసుకోవడం వల్ల చర్మం కూడా అందంగా కనిపిస్తుంది. ఇతర ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

**కోడి గుడ్డు:**

ప్రతి రోజూ కోడి గుడ్డు తీసుకుంటే చాలా మంచిదని వైద్యులు అంటూ ఉంటారు. కానీ చాలా మంది తీసుకోరు. రోజూ గుడ్డు తీసుకుంటే సర్వ రోగాలు నయం అవుతాయి. గుడ్డు.. పోషకాల నిధి అని వైద్యులు చెబుతూ ఉంటారు. కోడి గుడ్డులో జింక్‌తో పాటు ఇతర పోషకాలు కూడా లభిస్తాయి. హెయిర్‌కి కావాల్సిన సూక్ష్మ పోషకాలను అందించడంలో ఇవి సహాయ పడతాయి.

# మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ : ఏఐటీయూసీ



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** పలు డిమాండ్ల సాధనతో మున్సిపల్ కార్మికులు రెండు వారాల క్రితం సమ్మెలోకి దిగారు. మున్సిపల్ కార్మికులు సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సమ్మెను విరమణ చేస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఏసుదాస్ ప్రకటించారు. మున్సిపల్ కమీషనర్ కె.కొండలరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రభుత్వ హామీలకు కార్మిక సంఘాలు ఆమోదం తెలిపాయని పేర్కొన్నారు. 21 వేల వేతనంతో పాటు, ఇతర సదుపాయాలు కల్పిస్తామని,సమ్మె కాలానికి జీతాలు కూడా చెల్లిస్తామని మంత్రి ప్రకటించినట్లు వారు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తారని, సంక్రాంతికి ప్రతి కార్మికునికి కొత్త బట్టల కోసం వెయ్యి రూపాయలు ఇవ్వనున్నట్లు కూడా మంత్రి చెప్పారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు నాయకత్వం వహించి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఏఐటీయూసీ రాష్ట్ర ఫెడరేషన్ జె ఎ సి లకు కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.నూకరాజు, సి.హెచ్.వెంకటరమణ, డి.మహేష్,ఈ. చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలో శక్తిమంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితా .. భారత్ కి 80 వ ర్యాంకు!



ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితాను 'హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్' వెల్లడించింది. 2024కు సంబంధించిన ఈ సూచీలో ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, సింగపూర్, స్పెయిన్ అగ్రస్థానంలో నిలిచాయి. ఈ దేశాల పాస్‌పోర్టు ఉంటే వీసా లేకుండానే 194 దేశాలకు ప్రయాణించవచ్చునని రిపోర్ట్ పేర్కొంది. ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) డేటా ఆధారంగా దేశాల ర్యాంకులను నిర్ణయించారు.

శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితాలో గత ఐదేళ్లుగా జపాన్, సింగపూర్‌లు మొదటి స్థానంలో నిలుస్తున్నాయి. అయితే ఈ త్రైమాసికంలో యూరోపియన్ దేశాల ర్యాంకులు మెరుగయ్యాయి. ఇక 193 దేశాలకు వీసా రహిత ప్రయాణ అనుమతి ఉన్న ఫిన్లాండ్, స్వీడన్, దక్షిణకొరియా పాస్‌పోర్టులు రెండవ స్థానంలో నిలిచాయి. ఇక ఆస్ట్రియా, డెన్మార్క్, ఐర్లాండ్, నెదర్లాండ్స్ దేశాలు మూడవ ర్యాంకులో నిలిచాయి. ఈ దేశాల పాస్‌పోర్ట్‌తో 192 దేశాలకు వీసా రహిత ప్రయాణం చేయవచ్చు.

**భారత పాస్‌పోర్టుకు 80వ ర్యాంకు..**

ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితాలో భారత్ పాస్‌పోర్టుకు 80వ ర్యాంక్ దక్కింది. ఇండియన్ పాస్‌పోర్టుతో 62 దేశాలకు వీసా రహిత ప్రయాణాన్ని చేయవచ్చు. ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్ సహా ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఉజ్బెకిస్థాన్‌తో సమానంగా భారత్ 80వ ర్యాంకులో నిలిచింది. ఇక పొరుగునే ఉన్న పాకిస్థాన్ 101వ స్థానంలో వుంది. కేవలం 28 దేశాలకు మాత్రమే వీసా రహిత ప్రయాణ అవకాశమున్న ఆఫ్ఘనిస్థాన్ ఈ జాబితాలో అట్టడుగు స్థానంలో నిలిచింది. 29 దేశాలకు ప్రయాణ అవకాశమున్న సిరియా చివరి నుంచి రెండవ స్థానంలో ఉంది. ఇక ఇరాక్ పాస్‌పోర్ట్‌తో 31 దేశాలకు, పాకిస్థాన్ పాస్‌పోర్ట్‌తో 34 దేశాలకు వీసా రహిత ప్రయాణం చేయవచ్చు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

(1) టెండరు నెం. SANDT_CAMC_23_EI_HITAC_17

**పని పేరు:** వాల్తేరు డివిజన్‌లోని ఈ క్రింది 17 స్టేషనుల వద్ద ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ సిస్టమ్స్ (హిటాచి తయారీ) కొరకు 03 (మూడు) సంవత్సరాల కాలంనకు సమగ్ర వార్షిక నిర్వహణా కాంట్రాక్టు: (1) కొత్తవలస, (2) పెందుర్తి, (3) గోపాలపట్నం, (4) కంటకాపల్లి, (5) అలమండ, (6) కోరుకొండ, (7) చీపురుపల్లి, (8) దూసి, (9) తిలారు, (10) కోటబొమ్మాళి (11) నౌపడ, (12) పూండి, (13) నెల్లిమర్ల, (14) సిగడం, (15) పొందూరు, (16) శ్రీకాకుళం రోడ్డు, (17) పర్లాకిమిడి.

**ప్రకటిత విలువ:** ₹ 3,25,73,064/-, బయానా: ₹ 3,12,900/-.

(2) టెండరు నెం. SANDT_CAMC_23_DATALOGGERS

**పని పేరు:** వాల్తేరు డివిజన్ నందలి EFFTRONICS తయారీ డాటాలాగర్స్ (246 నెంబర్లు) మరియు వాటి సంబంధిత ఎక్విప్‌మెంట్ కొరకు 03 (మూడు) సంవత్సరాల కాలంనకు సమగ్ర వార్షిక నిర్వహణ కాంట్రాక్టు.

**ప్రకటిత విలువ:** ₹ 3,85,91,050.50, బయానా: ₹ 3,43,000/-.

టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ 11,800/-, (ప్రతి వ.నెంబరుకు) పూర్తి చేయు కాలం: 36 నెలలు (రెండు టెండరులకు)

బిడ్డింగ్ ప్రారంభ తేదీ: 15.01.2024 (రెండు టెండరులకు), **టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 29.01.2024న 1500 గంటలు (రెండు టెండరులకు).

ఈ టెండరునకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించరు మరియు ఏదైనా అట్టి మాన్యువల్ ఆఫర్ అందినచో తిరస్కరిస్తారు.

ఇ-టెండరు డాక్యుమెంట్లుతోపాటు పూర్తి సమాచారం మరియు వివరణ లభించు వెబ్‌సైట్: http://www.ireps.gov.in.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీరు, వాల్తేరు

PR-976/O/23-24


# పోలింగ్ స్టేషన్లకోసం పాఠశాలలను సిద్ధం చేయాలి



**విజయనగరం:** పోలింగ్ కేంద్రాలుగా వినియోగించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తూ పాఠశాలలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. పోలింగ్ బూత్‌లుగా వినియోగించేందుకు వీలుగా పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలను కల్పించడం, నాడూ-నేడు పనులపై కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. మండలాల వారీగా ఆయా పాఠశాలల పరిస్థితిపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతీ పోలింగ్ కేంద్రంలో కొన్ని కనీస మౌలిక సదుపాయాలు ఉండాలని చెప్పారు. త్రాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపు, విద్యుత్ సదుపాయం, ఫర్నీచర్, సరైన నేమ్ బోర్డులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు.

జిల్లాలో మొత్తం 1847 పోలింగ్ కేంద్రాలకు 223 మంది సెక్టార్ అధికారులను నియమించామని, వారంతా ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి నివేదికలు సమర్పించారని తెలిపారు. దీని ప్రకారం 397 పాఠశాలలకు ర్యాంపులు, 204 పాఠశాలలకు సరైన నేమ్ బోర్డులు, 83 పాఠశాలల్లో త్రాగునీటి సదుపాయం, 75 పాఠశాలలకు మరుగుదొడ్లు, 67 పాఠశాలల్లో ఫర్నీచర్, 27 పాఠశాలల్లో ఫ్యాన్లు, లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చెప్పారు. వెంటనే పనులు ప్రారంభించి, 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

చాలా పాఠశాలల్లో ఇప్పటికే ఆర్ఓ ప్లాంట్లు, మరుగుదొడ్లు ఉన్నాయని, అవకాశం లేనిచోట తాత్కాలిక పద్దతిలోనైనా ఏర్పాటు చేయాలని సూచించారు. శాశ్వత అవసరాలకు వినియోగించే విధంగా విద్యుత్ సదుపాయాన్ని కల్పించాలన్నారు. ఫ్యాన్లు, లైట్లు అన్ని గదుల్లో ఉండాలని చెప్పారు. వృద్దులు, దివ్యాంగులు పోలింగ్ బూత్‌లోకి సులువుగా చేరుకొనే విధంగా, తగిన స్లోప్ ఉండేవిధంగా నిర్ధేశిత ప్రమాణాలతో ర్యాంపులను నిర్మించాలని సూచించారు. అవకాశం ఉంటే వాటికి రెయిలింగ్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. చాలావరకు పోలింగ్ కేంద్రాలు పాఠశాలల్లోనే ఉన్నాయని, కేవలం 147 మాత్రమే ఇతర ప్రభుత్వ, ప్రభుత్వేతర భవనాల్లో ఉన్నాయని చెప్పారు. ఆయా భవనాలకు సైతం పూర్తిస్థాయిలో వసతులను కల్పించాలని ఆదేశించారు. నాడూ నేడు పనులు జరుగుతున్న పాఠశాలల్లో, ఈ మేరకు మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ఈ నెల 27 న మరోసారి సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తారని, ఆ లోగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో డిఆర్ఓ ఎస్డి అనిత, డిఇఓ లింగేశ్వరరెడ్డి, ఐసిడిఎస్ పిడి శాంతకుమారి, హౌసింగ్ పిడి శ్రీనివాసరావు, డివిఈఓ భీమశంకర్, ఇతర అధికారులు, ఎంఇఓలు, మండల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# జనవరి 13, శనివారం నాడు ప్రపంచవ్యాప్తంగా గాజాకు సంఘీభావం ప్రకటిద్దాం!

## జనసాహితి పిలుపు!

**శ్రీకాకుళం, (విశాఖ సమాచారమ్):** ప్రపంచవ్యాప్తంగా వున్న శాంతికాముకులు 13 జనవరిని గాజా సంఘీభావ దినంగా ప్రకటించారు. మూడు నెలలకుపైగా గాజాపై ఇజ్రేల్ చేస్తున్న అమానవీయమైన బాంబు దాడుల నేపథ్యంలో ఈ సంఘీభావాన్ని ప్రపంచవ్యాప్తంగా 13 జనవరిన తెలియచేస్తున్నారు. గాజాపై ఇజ్రేల్ చేస్తున్న దాడి అమానుషమైనది. గత శతాబ్దంలో జరిగిన యుద్ధ విధ్వంసాన్ని ఈ దాడులు గుర్తు చేస్తున్నాయి. రోజుకు 300 మందిని చంపుతూ ఇప్పటికి 30 వేల బాంబులను ఇజ్రేల్, గాజా పౌరులపై ప్రయోగించింది. ఫలితంగా గాజాలోని ఇళ్ళు 70 శాతం వరకు పూర్తిగానో, పరోక్షంగానో నేలమట్టమైపోయాయి. 21 వేలమందికి పైగా సాధారణ ప్రజలు, అందులో అత్యధికంగా పిల్లలు చనిపోయారు. గాజా నగర విధ్వంసాన్ని, బోస్టన్, హెల్సింకీ, రాటర్గాం, లీడ్స్ నగరాలను విధ్వంసం చేసినంతగా పోల్చవచ్చును.

ఐక్యరాజ్యసమితి ప్రకటన ప్రకారం గాజాలో సగం మంది ప్రజలు ఆకలితో అల్లల్లాడుతున్నారు. మందులు, వైద్యం లభించక బాంబుదాడులలో చనిపోయినవారికన్నా ఎక్కువమంది మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్యసంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. వెస్ట్ బ్యాంకుపై దాడులు జాతి పాలస్తీనీయుల నిర్మూలనా లక్ష్యంతో ఇవి సాగుతున్నాయి. వారికి శరణు ఇస్తున్న సిరియా, లెబనాన్లపై గూడా రెచ్చగొట్టే దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రేల్ కు అమెరికా, ఇంగ్లాండ్ ప్రభుత్వాలు ఇస్తున్న మద్దతుతో ఈ విధ్వంసం విచ్చలవిడిగా సాగుతోంది. యుద్ధాన్ని విరమించాలంటూ ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని ఇజ్రేల్ పట్టించుకోవడంలేదు. అంతర్జాతీయ సంస్థలు ఈ అన్యాయమైన యుద్ధాన్ని ఆపడంలో విఫలమైనాయి.

కనుకనే గాజాపై ఇజ్రేల్ చేస్తున్న విధ్వంసకరమైన యుద్ధానికి అంతర్జాతీయంగా నిరసన తెలియచేయటం అవసరమైంది. గతంలో వియత్నాం, దక్షిణాఫ్రికాలలో అమెరికా, ఇంగ్లాండులు చేసిన యుద్ధాలను ప్రపంచ ప్రజల నిరసనాగ్ని ఆపగల్గింది. ప్రపంచ ప్రజలందరం గాజాకు సంఘటితంగా మన నిరసనను జనవరి 13, శనివారం నాడు తెలియచేద్దాం.

# అంబెడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొనాలి : సేనాపతి రాము



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** ఈ నెల 19న విజయవాడలో జరిగే డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ విగ్రహావిష్కరణలో అందరూ తప్పనిసరిగా పాల్గొనాలని మేజర్ పంచాయతీ ఏటికొప్పాక గ్రామ సీనియర్ వైసీపీ నాయకులు సేనాపతి రాము అన్నారు. అంబెడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలోఈ నెల 19న జరగనున్న అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు యలమంచిలి నుంచి 4 బస్సులను ఏర్పాటు చేశారన్నారు. ఈ విగ్రహావిష్కరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. 404 కోట్లతో ఈ నిర్మాణం జరిగిందని విగ్రహంతో పాటు ఆహ్లాదకరంగా ఉండేలా అనేక నిర్మాణాలు చేపట్టారని సీఎం జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న మంచికి అందరూ తోడుగా ఉండాలి అని రాబోయే ఎన్నికల్లో గొప్ప విజయాన్ని అందజేయాన్నారు. అదేవిధంగా అణగారిన వర్గాలకు వైసీపీ ప్రభుత్వంలో అన్ని సామాజిక వర్గాలకు సమ న్యాయం చేశారన్నారు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెం గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ మాధవస్వామి దేవాలయంలో స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మ ప్రచారకు మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి యువతకి ఆదర్శంగా తీసుకొని ప్రతి గ్రామంలో విద్యార్థులు స్వామి వివేకానంద భావాలు చెప్పి చిన్నప్పటినుంచి దేశం పట్ల సమాజం పట్ల మన సనాతన హిందూ ధర్మం పరిరక్షణకు పాటుపడే విధంగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసుపల్లి సోమశేఖర, యమ్ పి టి సి రవి, పుష్యమిత్ర, రాజేంద్ర, కొండబాబు, అనకాపల్లి జిల్లా భవన నిర్మాణ కార్మికులు అద్యక్షుడు చుక్క కృష్ణ, పరవాడ ఖండం ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు మాతృమూర్తులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మ ప్రచార శిఖామణి స్వామి వివేకానంద : గణపతినీడి శ్రీనివాసరావు




**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** సనాతన ధర్మ ప్రచార శిఖామణి స్వామి వివేకానంద అని గణపతినీడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కుసుమంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి మాట్లాడుతూ వ్యక్తిత్వ నిర్మాణం, నైతిక సమగ్రత ,బలమైన ఆత్మవిశ్వాసం యువత అభివృద్ధికి అవసరమని స్వామి వివేకానంద చెప్పిన మాటలను మరిచిపోరాదని అన్నారు .ఆధునిక విద్య ఆధ్యాత్మిక జ్ఞానాల చక్కటి సమ్మేళనం పెంపొందించుకోవాలని యువతకు హితవు చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కుసుమంచి సుబ్బారావు మాట్లాడుతూ అప్పుడూ ఇప్పుడూ ఏ తరంలోనైనా యువతరానికి స్వామివివేకానంద స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. ఆర్ ఎస్ ఎస్ విభాగ్ సంఘచాలక్ డివివి కృష్ణంరాజు మాట్లాడుతూ విశ్వయవనికపై భారతదేశ కీర్తిపతాకను ఎగురవేసిన స్వామి వివేకానందను ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరక్టర్ కోట్ల సుగుణాకరరావు, ఈమంది సుధీర్, ఇప్పిలి గోపాలకృష్ణ, కంది సీతారాం, కొండల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా 100 మంది మహిళలకు బట్టలు పంపిణీ చేసారు.

# రామనారాయణంలో అలరించిన రంగవల్లులు పోటీలు



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో నిర్వహించిన రంగవల్లుల పోటీలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 100 మంది మహిళలు వేసిన ముగ్గులు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించాయి. కె అరుణ, జె జ్ఞానప్రసూన, సిహెచ్ కవితలు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా పోటీలలో విజేలకు ఎన్‌సిఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం పద్మశ్రీ బహుమతులను అందచేసారు.

# అనకాపల్లి జిల్లా బాల నృత్య కళాకారులకు టర్కీ డిప్లమాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లాకు చెందిన బహుభాషా బాల నృత్య కళాకారులకు టర్కీ డాన్స్ డిప్లమాలు లభించాయని స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ డైరెక్టర్ ఆర్ .జానకి పేర్కొన్నారు. ఇస్తాంబుల్ కు చెందిన బోగా జికి ఫోక్లర్ బిర్లిజి సాంస్కృతిక సంస్థ ప్రతి ఏడాది అంతర్జాతీయ స్థాయి ఆన్లైన్ డాన్స్ కాంపిటీషన్లను నిర్వహిస్తున్నది. "గో టు ఫెస్టివల్ ""పేరిట నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి ఆన్లైన్ పోటీలలో అనకాపల్లి జిల్లాకు చెందినటువంటి బహుభాషా నృత్య కళాకారులు కొండ్రెడ్డి నేహా అక్షయ అత్యధిక మార్కులతో గ్రాండ్ ఫిక్స్ డిప్లొమాను అందుకోగా, జూనియర్స్ విభాగంలో మాన్యా సంఘవి, డి. లక్ష్మి స్నేహితలు ప్రత్యేక డిప్లమాలను అందుకున్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో అత్యధిక మార్కులతో జనిత్ సంఘవి గ్రాండ్ ఫిక్స్ డిప్లమాను అందుకొని అంతర్జాతీయ స్థాయి అభినందనలు అందుకున్నాడు. వీరంతా విశాఖకు చెందిన స్కూల్ అఫ్ థియేటర్ ఆర్ట్స్ కొరియోగ్రాఫర్ ఆర్. నాగరాజు పట్నాయక్ దగ్గర బహుభాషా నృత్యాల్లో శిక్షణ పొందుతున్నారు .గతంలో థాయిలాండ్ ,ఇండోనేషియా, న్యూఢిల్లీ ,సింగపూర్ వంటి ప్రాంతాల్లో జరిగిన అంతర్జాతీయ స్థాయి ఫోక్ డాన్స్ ఫెస్టివల్స్ లో భారత బృందం తరపున పాల్గొని పలు అవార్డులు అందుకున్నారు .ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ బాలల ప్రతిభ సాంస్కృతిక, విజ్ఞాన పోటీలలో కూడా జనీత్ సంఘవి, మాన్యా సంఘవి , నేహా అక్షయ, లక్ష్మి స్నేహిత లు పాల్గొని జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తెచ్చారు. విశ్వవ్యాప్తంగా సుమారు 35 దేశాలు పాల్గొన్న ఈ టర్కీ డ్యాన్స్ పోటీలలో రిపీట్ ఎర్ర టన్ ,జమీరా సేటిన్ లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

# లైంగిక వేధింపుల చట్టం పక్కాగా అమలు చేయాలి

**విజయనగరం:** పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేదింపుల నిరోధక చట్టం అమలు పక్కాగా వుండాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎస్ నాగలక్ష్మి చెప్పారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల చట్టం పై రూపొందించిన వార్షిక కేలండర్ ను జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ. లింగేశ్వర రెడ్డి, డి.ఆర్.ఓ ఎస్.డి. అనిత, ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టు డైరెక్టర్ బి. శాంతకుమారి, కె.విజయ కుమారి, ఎస్.విద్య, పి. సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# లాటరీ ద్వారా ఫార్మాసిటీ భూనిర్వాసితులకు ఇళ్ల స్థలాల కేటాయింపు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పరవాడ ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన 40 మంది నిర్వాసితులకు జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ లాటరీ ద్వారా ఇళ్ల స్థలాలను (ప్లాట్లను) కేటాయించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఫార్మాసిటీ భూనిర్వాసితులకు ఇళ్ల స్థలాల కేటాయింపు కార్యక్రమం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ లోకాయుక్త ద్వారా 25 మంది, స్పందన ద్వారా 15 మంది వెరశి 40 మంది నుండి ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తులు అందాయన్నారు. ఈ 40 మందికి లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ చెప్పారు. అనంతరం లబ్ధిదారుల సమక్షంలో లాటరీ తీసి లబ్ధిదారులకు కేటాయించే ప్లాట్ల వివరాలను తెలిపారు. కేటాయించిన 40 మందికి శుక్రవారం నాటికి పట్టాలను సిద్ధం చేసి రెండు రోజుల్లోగా పంపిణీ చేస్తామని జెసి హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## గజల్

శిఖరాలెపుడూ అడగవోయ్ జైకొట్టమని..!
చెప్పక నేర్పును మౌనముగా ఎదగమని..!
సాహసయాత్రే జీవితమోయ్ అనుక్షణం..
అనుభవమే తెలుపును భయమే అడ్డమని..!
అడుసున పుట్టిన పద్మం రుజువేమిచూపె..
బాధలకంటక వికసించునె జ్ఞానమని..!
ఏంచేస్తున్నా పుడమి పెదవి విప్పిందా..
చాటుతు ఉన్నదే సహనమే తన ధనమని..!
తెగనరుకుటకు..ఏ కత్తి పరవశించునట..
తెలుసు దానికది జన్మకర్మల ధర్మమని..!
కిరణం వేడికి బీజం మొలకెత్తునెలా..
పర్యావరణ పరిరక్షణ తన కర్తవ్యమని..!
జయాపజయాల సాక్షిగ మాధవ క్రీడయె..
చెప్పాలెవరికి విశ్వం మైత్రీ స్వర్గమని..!
ఈ వాలని కన్నులింటి..పొరునోపలేను..!
ఆవేదన పడుమనసును..అనువదించలేను..!
కలలపూల తోటనుండి..బయటపడుట ఎటుల..
విరహానికి అదేపనిగ..స్వరం కూర్చలేను..!
ఎంత వెర్రిప్రేమ నాది..ఎలా చెప్పవలెను..
మాటలతో రణమేదో..సలుప తలచలేను..!
బాటసారి పాత్రకన్న..మేలైనది ఏదొ..
అఖరు మజిలీ కోసం..కలత చెందలేను..!
కడదాకా తోడెవరో..గాలికేమి తెలుసు..
దీపముతో గాక అసలు..ముచ్చటించలేను..!
దారంతా పలకరించు..హితవరులే నిజము..
ఎగిరివెళ్ళు రాచిలుకను..పట్టి ఆపలేను..!
మాధవునికి ప్రేమలేఖ..ఈ మనసే నందు..
అక్షరాల బందీగా..క్షణం ఉండలేను..!
మేలుకున్న మనసుగాక..హృదయమెక్కడుంది..!?
వర్షించే ప్రేమగాక..గగనమెక్కడుంది..!?
నిప్పుతోటి ఆటాడుట..తెలియకుండ బ్రతుకేమిటి..
క్రీడాస్థలి గాక అసలు..శూన్యమెక్కడుంది..!?
పరుగుతీయు వేడుకేల..ఉన్నదంత వేడుకయే..
వెతుకులాట ముగియకుండ.. శాంతమెక్కడుంది..!?
అక్షరాల తీర్థమసలు..పొంగించే పనేముంది..
మౌనంలో మునగకుండ..పద్యమెక్కడుంది..!?
డాలరులను తలకెత్తుకు..కొనగలిగే స్వర్గమేది..
కాసుకు తిరకాసు పడక..మోక్షమెక్కడుంది..!?
ఆశకు అత్యాశకు పెద్ద..తేడాయేం ఉండదులే..
బహుమతిగా నిరాశయే..సౌఖ్యమెక్కడుంది..!?
ఏమికాని ఈనేనే..మరిమాధవ నిలయమోయ్..
రహస్యమిది బోధపడక..పూర్ణమెక్కడుంది..!?
ఆశమించి చితిమంటయె..లేదంటానోయ్ నేస్తం..!
ఎల్లప్పుడు మెలకువగా..ఉండంటానోయ్ నేస్తం..!
రాలిపడును సంకెళ్లే..ఒక్కచిన్ని చిరునవ్వుకు..
తలపులింట చేరి సరిగ..చూడంటానోయ్ నేస్తం..!
మరుగుజ్జుగ మనసుంటే..ఆకాశం దాటుటెలా..
లోలోపలి చెత్త తెలిసి..కాల్చంటానోయ్ నేస్తం..!
ఉచితాలకు ఎగబడుటే..అనుచితమని చెప్తానోయ్..
అవినీతిని పేల్చుబాంబు..ఓటంటానోయ్ నేస్తం..!
పాఠం నేర్పే గురువై..ఉండే మట్టియె తోడుగ..
ఒక తియ్యని పాటలాగ..బ్రతుకంటానోయ్ నేస్తం..!
బతుకుతడిని కాపాడే..పిచుకగుండె సడి ఏదోయ్..
ప్రాణాలకు ప్రాణంలా..నిండంటానోయ్ నేస్తం..!
కణకణమున దాగున్నవి..ప్రియమాధవ నాదాలే..
ఆస్వాదించే అభిలాషకు..జయమంటానోయ్ నేస్తం..!

## యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** నవ భారత నిర్మాణంలో యువత భాగస్వాములు కావడమే శ్రీ స్వామి వివేకానంద ప్రధాన ఆశయమని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు దాడి రత్నాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు స్వామి వివేకానంద 161వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలో కరణాలవీధిలో గల శ్రీ స్వామి వివేకానంద విగ్రహానికి రత్నాకర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రత్నాకర్ మాట్లాడుతూ గత 25 ఏళ్ల క్రితం ఇక్కడ స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటు చేసిన స్థానిక పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అలాగే స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా నిర్ణయించి ప్రతీఏటా అన్నిచోట్ల స్వామి వివేకానంద పేరుతో జాతీయ యువజనోత్సవాలు జరుపుకోవడం జరుగుతుందన్నారు. అలాగే ఆ రోజుల్లోనే స్వామి వివేకానంద యువతను ఉద్దేశించి వారికి ఆదర్శంగా ఉండాలని యోగా, మెడిటేషన్ వంటి కార్యక్రమాలపై అనేక సందేశాలు ఇచ్చేవారన్నారు. అలాగే మొట్టమొదటి సారిగా అమెరికాలో ఆయన ఇచ్చిన సందేశం భారతీయను, హిందూమతాన్ని ఉద్దేసించిన ప్రసంగాలు ఈరోజుకు చిరస్థాయిగా పుస్తకాలలో పొందుపరచబడి ఉన్నాయన్నారు. అలాగే ముఖ్యంగా యువత స్వామి వివేకానంద ఆశయాలు నెరవేర్చే దిశగా ప్రయాణిం చాలన్నారు. యువత నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావడమే వివేకానంద ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. ఆయన ఆశయ సాధన మేరకు నవ భారత నిర్మాణానికి మనమంతా కృషి చేద్దామని రత్నాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బోడి వెంకటరావు, కుప్పిలి జగన్మోహన్, సిలపరశెట్టి బాబీ, వాయిబోయిన నాగు, చింతా లక్ష్మణరావు, జోరీగల శ్రీను, కర్రి నిఖిల్ యాదవ్, పల్లా సత్తి అప్పారావు, కోడూరి త్రినాధ్, కొత్తా గోపాలకృష్ణ, కటారి దేముడు, సాయి, బోడి జగదీష్, రేబాక ఇంద్రకుమార్, జెర్రిపోతుల ధర్మారావు, భర్నికాన శ్రీను, స్థానిక ప్రజలు, డీవీఎన్ కాలేజీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అబ్దుల్ కలాం సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలు కోటి సంతకాలు సేకరణ



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి ఐ సి డి ఎస్ పరిధిలో జగనన్న కు చెబుదాం పేరు తో కోటి సంతకాలు కార్యక్రమంలో భాగంగా నక్కపల్లిలో ఉపాద్యాయ సంఘం సీనియర్ నాయకులు పి.వెంకటరావు, నక్కపల్లి వ్యాపార సంఘం గౌరవ అధ్యక్షులు మామిడి తాతాజీ లు మొదటి సంతకాలు పెట్టి సంతకాలు కార్యక్రమ ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం పంతాలకు పట్టింపులకు పోకుండా వెంటనే స్పందించి కనీసం వేతనాలు ఇవ్వాలి, గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.దుర్గారాణి, ప్రొజెక్టు అధ్యక్షులు బి.సుబ్బలక్ష్మి, నాయకులు కవిత,లక్ష్మీరాజ్యం, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లోకి చేరిన సమగ్ర శిక్షా ఉద్యోగులు



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం విద్యా శాఖ కార్యాలయం లో ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎస్ ఎస్ ఏ ఉద్యోగులు గత కొంతకాలంగా తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేసిన సమగ్ర శిక్షా ఉద్యోగులు ముఖ్యమంత్రి జగనన్న వారి డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించడంతో ఎట్టకేలకు విధుల్లోకి చేరారు.దీనితో ప్రభుత్వ కార్యాలయాలన్నీ పూర్తిస్థాయి సిబ్బందితో కళకళలాడాయి.గురువారమే విధుల్లోకి చేరినట్లు మండలశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగులు ప్రతినిధులు డి.అప్పారావు, శేఖర్, ఎమ్ ఐ ఎస్ ఝాన్సీ తదితరులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మండలవిద్యాశాఖాధికారి కె.నరేష్ కు జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. ఈ సందర్భంగా మండలవిద్యాశాఖాధికారి కె.నరేష్ మాట్లాడుతూ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, ఆదేశించారు. నేటినుండి విద్యాశాఖ కు సంబంధించిన పనులన్నీ యధావిధిగా జరుగుతాయన్నారు. నేటినుండి నాడు-నేడు పనులను పూర్తి చేయాలన్నారు. సమగ్రశిక్షా ఉద్యోగుల ప్రతినిధులు మాట్లాడుతూ గతనెల 20 నుండి రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఆందోళనలు చేపట్టామని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమ డిమాండ్లను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఝాన్సీ, డేటా ఎంట్రీ ఆపరేటర్ శివ లతోపాటు సి.ఆర్.పీ లు డి.అప్పారావు, శేఖర్, గంగేశ్వరరావు, జ్యోతి, దేవి, మరియు పార్ట్ టైం సిబ్బంది ఎ.నాగార్జున, సునీల్, పి.కోటి,రత్న రాజు , శ్రీదేవి మండలంలో పలు ఉన్నతపాఠశాలల సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

## క్రీడల మౌలిక వ్యవస్థలు కల్పనకు కృషి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో క్రీడల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టణ శెట్టి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల బాలికలు యువతీ యువకులకు క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్, పవర్ లిఫ్టర్ కుసుమ గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి మంజులవాణి, డీఈవో మహాలక్ష్మమ్మ, డిపిఓ ఆర్ శిరీష రాణి ఏపీఐఐసీ జెడ్.ఎం త్రినాధ్ పి.ఆర్. ఏఈ వీరు నాయుడు ఆర్ అండ్ బి ఈఈ రమేష్ డి ఎస్ డి ఓ ఎల్ వి రమణ జెడ్ పి ఏఓ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## అనిల్ నీరుకొండ విద్యా సంస్థలలో నింగికెగసిన సంక్రాంతి సంబరాలు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రెండు రోజుల పాటు 11 మరియు 12 తేదీలలో ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ ఆవరణలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహిచారు. కాలేజీ ఆవరణలో మొతం పల్లెటూరి వాతావరణం కనిపించే విధంగా పల్లెటూరి ఇండ్లు, అరుగులు, పశువులు, హరిదాసులు, గంగిరెద్దులు, తీర్చి దిద్దారు.

ఇందులో భాగంగా రంగోలి, గాలిపటాలు, సంస్కృతి ని ప్రతిబింబించేలా, వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహిచి బహుమతులను ప్రదానం చేసారు. విద్యార్థులు, డాక్టర్స్, ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరు ఉత్సాహంగా పాల్గొని దాండియా ఆడారు.

డా. పి వి సుధాకర్, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ డీన్ & ప్రినిసిపాల్, అందరికి శుభాకాంక్షలను అందించారు మరియు ఉత్సాహముగా గాలిపటాలు ఎగురవేశారు. మన సంస్కృతి ఔన్యత్యన్ని అందరు గౌరవించే అంత ఆదర్శ ప్రాయమైనదని సంక్రాంతి పండుగని తెలియజేసారు.

## పరిమి భువనేశ్వరి ఆధ్వర్యంలో మన ఊరు మన పండుగ కార్యక్రమంలో ముగ్గుల



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** భీమిలి పట్నం తగరపువలస లో గల జీవిఎంసీ 1 వ వార్డు లో సంక్రాంతి పండుగ సందర్భంగా జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు 1 వార్డు జనసేన అధ్యక్షురాలు పరిమి భువనేశ్వరి ఆధ్వర్యంలో సప్తగిరి థియేటర్ ప్రాంతంలో ముగ్గుల పోటీలు నిర్వహిం చటం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా భీమిలి జనసేన ఇంచార్జి పంచకర్ల సందీప్ హాజరు అయ్యారు. ఈ ముగ్గుల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వడం జరిగింది. ఇందులో ప్రథమ బహుమతి కె. మౌనిక, ద్వితీయ బహుమతి ఉషశ్రీ, తృతీయ బహుమతి జి. సత్యశ్రీ లకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పంచకర్ల సందీప్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలో అపార్ట్మెంట్ లో నివసి స్తున్న ప్రతీ ఒక్కరు ఓటు ను వినియో గించుకోవాలి అని కోరారు. టీడీపీ, జనసేన పొత్తు లో ప్రతి ఇంటి కి మేలు జరిగేలా చర్యలు తీసుకుంటాం అని తెలియ జేసారు. ఆంధ్రప్రదేశ్ లో స్త్రీలు కు రక్షణ లేదు అని విమర్శ చేశారు.30000 లుకు పైగా అమ్మాయి లు మిస్సింగ్ కేసులు నమోదు అయ్యినట్లు తెలిపారు.1 వార్డు అధ్యక్షురాలు పరిమి భువనేశ్వరి మాట్లా డుతూ జనసేన- టీడీపీ కలిపి అధికారం లోకి వస్తే 18 సంవత్సరాలు నిండిన ప్రతి స్త్రీలు కు 15000 ఇస్తామనీ అలాగే సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ ఇస్తామని అదేవిధంగా స్త్రీలకు బస్సు పాస్ ప్రియ ఇస్తామని అన్నారు. విద్యార్థుల కు అమ్మఒడి ఇంటి లో ఇద్దరు ఉన్నా లేఖ ముగ్గురు ఉన్నా అమ్మఒడి ఇస్తాము అన్నారు. ఈ యొక్క కార్యక్రమానికి జనసేన వీర మహిళలు, 2 వార్డు అధ్యక్షులు నీలాపు శంకర్ రెడ్డి,3 వార్డు అధ్యక్షులు, మండల స్థాయి నియోజకవర్గ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## రాజాధిరాజ వాహనంపై స్వామివారి తిరువీధి సేవ



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తంగా వేంచేసియున్న శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవములు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయంలో నిత్య కార్యక్రమాలు పూర్తి చేసిన అనంతరం గోదాదేవి అమ్మవారిని పుష్ప తోటలోనికి తీసుకుని వెళ్లి అక్కడ విశేష అర్చనలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి ధనుర్మాస వ్రతంలో భాగంగా తిరుప్పావై లోని కరవైగళ్ పిన్ శెన్రు కానం శేర్ న్దున్ఫోమ్ 28వ పాలసీమతో ప్రత్యేక నీరాజనములు సమర్పించారు. అనంతరం తీర్థ గోష్టి భక్తులందరకు ప్రసాదు వినియోగము నిర్వహించారు. తరువాత శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారిని రాజాధిరాజ వాహనంపైన గోదాదేవి అమ్మవారిని పల్లకిలోనూ అదిష్ఠింప చేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు అర్చకులు సంకర్షణ పల్లి రాజగోపాల కృష్ణమాచార్యులు పిసపాటి వెంకట శేషాచార్యులు భాగవతం గోపాలచార్యులు దేవస్థానం ఇన్స్పెక్టర్ కూర్మేశ్వరరావు గ్రామానికి చెందిన రేజేటి సింగరాచార్యులు పలు గ్రామాలకు చెందిన భక్తులు

## సంక్రాంతి ఉత్సవాలు లో సందడి చేసిన అవంతి

**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** తగరపువలస బంతాట మైదానంలో 1వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని పద్మావతి రామునాయుడు ఆధ్వర్యం లో - 1వ వార్డు ఉపాధ్యక్షులు పందిరి విజయ్ కుమార్ సమలీకృత కార్యాచరణ లో నిర్వహించిన సంక్రాంతి ఉత్సవాలు లో మాజీ మంత్రి భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు అయిన గౌ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై పాల్గోవడం జరిగింది.

ఉత్సవాలు లో భాగంగా భోగి మంటను వెలిగించి అందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం 1వ వార్డు పరిదిలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ను అవంతి తిలకించి - అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన సంక్రాంతి పండుగ ప్రత్యేక పిండి వంటలను రుచి చూడటం జరిగింది.

అనంతరం ముగ్గులు పోటీలకు న్యాయ నిర్ణేత అవంతి చేతులు మీదుగా విజేతలకు బహుమతులు అందజేయడం జరిగింది.

కార్యక్రమంను ఉద్దేశించి అవంతి మాట్లాడుతూ హైందవ సంస్కృతి సాంప్రదాయ పండుగల్లో సంక్రాంతి ఓ ప్రత్యేకమైన పండుగ అని,ఈ పండుగ కు సుదీర్ఘ ప్రాంతాల్లో ఉన్న ఆత్మీయులు అందరూ తమ తమ సొంత ఊళ్లకు వచ్చి కుటుంబం తో స్నేహితులు తో ఆట పాటల్లో గడపడం ఓ పండుగ వాతావరణం నెలకొంటుంది అని,ఇప్పటి తరం నవీనత్వానికి మ్రొగ్గు చూపుతూ మన దేశ సార్వత్రిక సాంప్రదాయాలకు వాటికి అనుసందానమైన పండుగలు పోకడలను మరిచిపోతున్నారని,అలాంటి నేటి తరానికి పెద్దలు సాంప్రదాయ పండుగల విలువలు ప్రాముఖ్యతలను తెలియజేయాలని ఈరోజు ఇక్కడ గడిపిన కొన్ని క్షణాలు కూడా పండుగ



వాతావరణం నెలకొంది అని,మహిళలు వేసిన వివిధ రకాలైన సంక్రాంతి ముగ్గులు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయని నా చిన్నప్పుడు రోజులు మళ్ళీ గుర్తుకు వచ్చాయని అందరూ సంక్రాంతి పండుగ ను సంతోషం గా జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలుపుతూ మాట్లాడారు.

ఈ సంక్రాంతి ఉత్సవాలు లో 1,2 వార్డు వైసిపి శ్రేణులు - ఆయా ఆయా పదవుల్లో ఉన్న వారు - సచివాలయం కన్వీనర్ లు - గృహ సారథులు కార్యకర్తలు - అభిమానులు - ప్రజలు - అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బిజెపి ఎంపి శ్రీ జీవీఎల్ నరసింహారావు అధ్యక్షతన

# 'జీవీఎల్' మహా సంక్రాంతి సంబరాలు - 2024

జనవరి 12,13,14,15 తేదీలలో




ముగ్గుల పోటీలు : తేది 12-1-2024

## ఎయు ఇంజనీరింగ్ గ్రౌండ్స్, మద్దిలపాలెం, విశాఖపట్టణం.

మీరంతా నాలుగు రోజులపాటు సంక్రాంతి మహా సంబరాలలో మాతో కలిసి ఆనందాలు పంచుకోండి.

మీ కోసం ప్రత్యేకంగా ఒక గ్రామాన్నే నిర్మించాం.

మద్దిలపాలెం ప్రక్కనే గల ఎయు ఇంజనీరింగ్ క్రాలేజీ గౌండ్స్‌లో సువిశాల ప్రాంగణంలో అనేక **విందు, వినోదాల నడుమ ప్రఖ్యాత సినీ తారలు, జబర్దస్త్ కళాకారులు, గాయనీ గాయకులు, రాజకీయ ప్రముఖులతో మీరు ఆనందాలు పంచుకోవచ్చు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా మన నాయకులు శ్రీ జీవీఎల్ నరసింహారావుగారి సౌజన్యంతో నిర్వహించబడుతున్న ఈ మహా సంక్రాంతి వేడుకలకు ఎటువంటి రుసుములు లేవు.**

**ఇక్కడ అనేక రకాల పోటీలు కూడా నిర్వహిస్తున్నాం. సంప్రదాయ దుస్తులలో యువతులకు, మహిళలకు అనేక బహుమతులతో పోటీలు.**

***పురుషులకు పంచెలు కట్టించడంలో పోటీ.***

ముగ్గుల పోటీలో గెలిచిన వారికి అంతర్జాతీయ స్థాయి వండర్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికేట్ అందజేస్తారు

**ముగ్గుల పోటీలు** : తేది 12-1-2024 ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు



ప్రథమ బహుమతి రూ. 25,116/-

ద్వితీయ బహుమతి రూ. 10,116/-

తృతీయ బహుమతి రూ. 5,116/-

ప్రత్యేక బహుమతులు. అత్యంత ఆకర్షణగా లక్కీ డిప్ రూ. 10,000/-



**జీవీఎల్‌తో సెల్ఫీ దిగండి - లక్కీడిప్ కూపన్ పొందండి**

**శ్రీ జీవీఎల్ నరసింహారావుగారు, ఎంపి, రాజ్యసభ - బిజెపి**

***సుమారు 150 స్టాల్స్‌తో అన్ని రకాల వస్తువులతో ఎగ్జిబిషన్.***

చేనేత కళాకారులచే స్వయంగా తయారుచేయబడిన వస్త్రముల దుకాణములు, సాంప్రదాయ పిండివంటలు అక్కడికక్కడే తయారు చేసి విక్రయించే దుకాణాలు, అక్షయపాత్ర వారిచే ఉచితంగా అనేక రకాల ప్రసాదాలు మీకు మధురానుభూతులు కలిగిస్తాయి. గంగిరెద్దుల ప్రదర్శన, కోలాటాలు, తప్పెటగుళ్ళు, కామెడీ స్కిట్‌లు, అతిపెద్ద సంగీత విభావరి, పలురకాల సంప్రదాయ నృత్యాలు మిమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంటాయి.



**ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు సందడే సందడి.**

**ఫోన్ నెంబర్లు : 98481 97933, 93934 81818, 82475 26179**



VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Pardwada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676